
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం, 11 జూలై 2025
5



నేడు, రేపు ఎంపీ రేణుక పర్యటన



ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యురాలు, మాజీ మంత్రి రేణుకాచౌదరి శుక్ర, శనివారాల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం ఖమ్మం చేరుకోనున్న ఆమె 11 గంటలకు కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించే విలేకరుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. శనివారం కొత్తగూడెంలో ఎమ్మెల్యే కూనంనేనితో భేటీ అవుతారు. అనంతరం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎంపీ క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

ధన్యజీవి దమ్మక్క

- భద్రాచలంలో సంప్రదాయబద్ధంగా సేవా యాత్ర
- ములుగు జిల్లా వెంకటాపురంలోనూ నిర్వహణ
- ఉత్సవాల్లో తమను విస్మరించారని ఆదివాసీ జేఏసీ నిరసన

7



దమ్మక్క చిత్రపటంతో గిరి ప్రదక్షిణకు బయలుదేరిన అర్చకులు, భక్తులు



కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సింగరేణి గనులను ప్రైవేటీకరిస్తే

ఊరుకోబోం..

- జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ఉపయోగం లేదు
- కనీసం కొత్తగూడేనికి ఎయిర్‌పోర్ట్ తీసుకురాలేకపోయారు
- బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా 22న రైల్‌రోకో
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- కొత్తగూడెం క్లబ్‌లో జాగృతి జిల్లాస్థాయి సమావేశం

7

రాష్ట్ర ఆవిర్భావం జరిగిన తర్వాత పదేళ్ల పాటు ప్రతిపక్ష పాత్ర పోషించిన కాంగ్రెస్.. ఏడాదిన్నర క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారం చేపట్టింది. అధికారంలో లేకపోయినా పార్టీ కోసం పనిచేసిన, అప్పటి ప్రభుత్వంతో పోరాడిన శ్రేణులు పార్టీలో తమ గుర్తింపు కోసం తహతహలాడుతున్నారు. ఏడాదిన్నరగా ఇటు పార్టీ సంస్థాగత.. అటు ప్రభుత్వ నియామక పదవుల కోసం ఎదురుచూస్తున్న వారి ఆశలు త్వరలోనే నెరవేరబోతున్నాయి. ఈ నియామకాలను పూర్తి చేయాలని నిర్ణయించిన పార్టీ అధిష్ఠానం ఆ దిశగా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే పదవులకు అర్హతలు, నియమ నిబంధనలు ప్రకటించిన నేపథ్యంలో పార్టీ పరిశీలకులు రంగంలోకి దిగారు. గురువారం ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయానికి పరిశీలకులు, నేతలు, ఆశావహుల రాకతో సందడిగా మారింది.



పదవులకు వడపోత!

- రంగంలోకి పార్టీ పరిశీలకులు
- కాంగ్రెస్ ఖమ్మం జిల్లా కార్యాలయం వద్ద హడావుడి
- అటు సంస్థాగత, ఇటు నియామక పదవులపై కసరత్తు

ఖమ్మం, జూలై 10 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటిన తర్వాత నియామక పదవుల సందడి మొదలైంది. ఈ పదవుల కేటాయింపుపై జిల్లాస్థాయిలో కసరత్తు జరుగుతోంది. పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించే వడపోత కార్యక్రమానికి అధిష్ఠానం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం పార్టీ పరిశీలకులు రంగంలోకి దిగారు. దీంతో ఖమ్మంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయం వద్ద కొలాహలం నెలకొంది. ఇటీవల పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్‌గా నియమితులైన ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచందర్‌రెడ్డితోపాటు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు గురువారం ఇక్కడికి రావడం.. కార్యకర్తలు, నాయకులు కూడా తరలిరావడంతో అక్కడ హడావుడి కనిపించింది. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.శ్రావణ్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులుగా చకిలం రాజేశ్వరరావు, కీసరి మహిపాల్‌రెడ్డి, దైదా రవీందర్ ఖమ్మం ఎంపీ స్థానంలోని అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులుగా వ్యవహరిస్తున్నారు.

అర్హులైన వారి వివరాల సేకరణ

శ్రావణ్‌కుమార్‌రెడ్డి గురువారం సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోతు రాందాస్‌నాయక్, ముఖ్య నాయకులతో చర్చించారు. ఈ క్రమంలో వారి నుంచి మండల అధ్యక్ష పదవుల్లో అర్హులైన ఐదుగురు పేర్లతోపాటు నియోజకవర్గ స్థాయిలో నియామక పదవులకు అర్హులైన వారి పేర్లను తీసుకున్నారు. ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని కొత్తగూడెం, అశ్వారావుపేట, ఖమ్మం, మధిర, పాలేరు నియోజకవర్గాలకు సంబంధించి శనివారం సమీక్ష నిర్వహించి జాబితాలను సిద్ధం చేయనున్నారు. శుక్రవారం మహబూబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని భద్రాచలం, పినపాక, ఇల్లెందు నియోజకవర్గాల పరిధిలో మండలపార్టీ అధ్యక్షులు,

(మిగతా 6వ పేజీలో)

నామినేటెడ్ పోస్టులకు ప్రతిపాదనలు..

నామినేటెడ్ పదవుల విషయంలో ప్రతీ నియోజకవర్గం నుంచి రెండుకంటే ఎక్కువ మంది పేర్లు ప్రతిపాదిస్తున్నారు. అయితే ఎవరు పేర్లు ఇస్తున్నారన్నది కమిటీలు గోప్యంగా ఉంచుతున్నాయి. పార్టీ మండల అధ్యక్ష పదవుల విషయంలో కనీసం మూడేళ్లు పార్టీలో ఉన్నవారినే అర్హులుగా నిర్ణయించారు. జిల్లా కమిటీ అధ్యక్ష పదవికి కనీసం ఐదేళ్లపాటు పార్టీలో పనిచేస్తున్న వారికి అవకాశమివ్వాలని నిర్ణయించారు. మధ్యలో చాలా కాలం పార్టీలో పనిచేసి వెళ్లిపోయి.. తిరిగి గత ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన వారి సీనియారిటీని.. మళ్లీ పార్టీలో చేరిన సమయం నుంచే లెక్కిస్తారు. దీంతో అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీలో చేరిన వారికి సంస్థాగత పదవులు దక్కే అవకాశం కనిపించడంలేదు.



ఖమ్మం డీసీసీ కార్యాలయంలో ప్రసంగిస్తున్న వంశీచంద్‌రెడ్డి

పనిచేసే వారికే పదవులు

- ఉమ్మడి జిల్లా శ్రేణుల్లో వర్గాల్లేవు
- అంతా కలిసికట్టుగానే పనిచేస్తున్నారు
- కాంగ్రెస్ ఇన్‌చార్జ్ చల్లా వంశీచంద్‌రెడ్డి
- ఖమ్మం డీసీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశం

6

'మెటా ప్లస్'

మోసాలు మరెన్నో!

- ఉమ్మడి ఖమ్మంతోపాటు ఇతర జిల్లాల్లోనూ ఘటనలు
- కరీంనగర్ సైబర్ క్రైం పోలీసు చర్యలతో తెరపైకి
- రూ.కోట్లను కొల్లగొట్టిన వైనం.. వందల సంఖ్యలో బాధితులు
- వ్యాలెట్ల క్రిప్టో మోసాలను గతంలోనే వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'
- ట్రూ, ట్రస్ట్, మెటా ప్లస్ లాంటి అరాచకాలు బట్టబయలు

ఖమ్మం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): 'పెట్టుబడి చిన్నదే... కానీ లాభాలు మాత్రం దండిగా ఉంటాయి. పెట్టిన పెట్టుబడికి మూడింతలు వస్తుంది' అంటూ ఆశలు రేపుతారు. అంతకుమించిన నగదు కావాలంటే మీరు పెట్టిన పెట్టుబడి కంటే ఎక్కువ ఇతరులతో పెట్టిస్తే పదింతలు సంపాదించొచ్చని ఆకాశానికి ఎత్తుతారు. పెద్ద పెద్ద హాళ్లలో సెమినార్‌లు నిర్వహిస్తారు. ఎక్కువ మందిని చేర్పించిన వారికి సన్మానాలు చేస్తారు. అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టిన వారిని ట్రిప్‌ల పేరుతో విమానాలు ఎక్కించి దుబాయ్, గోవా లాంటి ప్రాంతాలకు తీసుకెళ్తారు. అలా ఎక్కువ మొత్తంలో నగదు సమకూరిన తర్వాత యాప్‌లో నగదు ఉపసంహరణలు నిలిపివేసి, ఆ తర్వాత అక్కడి ఉడాయిస్తారు. ఇది కొన్నేళ్లుగా 'క్రిప్టో కరెన్సీ'కి సంబంధించి పలు వ్యాలెట్ల పేరుతో సాగుతున్న దందా. అలాంటి వ్యాలెట్లలో 'మెటా ప్లస్' అనేది కూడా ఒకటి. అయితే గతంలో ప్రజలు అలాంటి వ్యాలెట్ల ద్వారా మోసపోయిన కేసుల్లో ఇతర ప్రాంతాలకు చెందిన వారు నిర్వాహకులుగా ఉండగా.. మెటాప్లస్‌లో మాత్రం నిర్వాహకులు ఖమ్మానికి చెందిన వారే కావడం గమనార్హం. కాగా క్రిప్టో కరెన్సీ పేరిట సాధారణ, మధ్య తరగతి ప్రజల్లో ఆశలు రేపి కొల్లగొడుతున్న విషయాలను గతంలో పదుల సంఖ్యలో కథనాలు ప్రచురించగా.. మెటాప్లస్ అరాచకాన్ని కూడా వెలుగులోకి తెచ్చింది.

లబోదిబోమంటున్న బాధితులు

'మెటాప్లస్' పేరుతో అందినకాడికి వసూలు చేసిన నగదు రూ.కోట్లకు చేరిన అనంతరం నిర్వాహకులు (మిగతా 6వ పేజీలో)



'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలు

'గంజాయి కేసు' బెదిరింపు

ఘటనలో చర్యలు

- డీజీ కార్యాలయానికి ఏసీపీ అటాచ్
- ఇద్దరు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్‌వేటు

6

ఇంజనీర్ల కృషి.. భవితకు దిక్సూచి..

- అద్భుత కట్టడాలు.. చెరగని జ్ఞాపకాలు
- చారిత్రక నిర్మాణాల రూపకర్త, తెలంగాణ ఇంజనీర్ల పితామహుడు నవాజ్ బహదూర్
- నేడు తెలంగాణ ఇంజనీర్స్ డే

6

ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో

మెగా డ్రైవ్

- భద్రాద్రి జిల్లాలో ఒకేరోజు 503 ఎకరాల్లో తోటలు
- పామాయిల్‌తో దీర్ఘకాలిక ఆదాయం పొందవచ్చు..
- ఆయిల్‌ఫెడ్ డివిజన్ అధికారి

6

నిర్ణీత వ్యవధిలో వ్యవసాయ విద్యుత్

కనెక్షన్లు ఇవ్వాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ మధుసూదన్

7

కార్యాచరణ లేక..

- ఏటికేడు పెరుగుతున్న జనాభా
- నియంత్రణపై పట్టింపులేని ఫలితం
- 2011లోనే 26లక్షలు దాటిన ఉమ్మడి జిల్లా జనాభా
- ఇప్పటికి 30 లక్షలకు చేరువై ఉంటుందని అంచనా

నేడు ప్రపంచ జనాభా దినం



ఖమ్మం కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): 'ఐదుగురు బిడ్డల తల్లి.. పిల్లలతోనే భిక్షాటన చేయిస్తూ వచ్చిన కొద్దిపాటి సొమ్ముతో బతికేస్తుంది. అంటే యాచన చేయించేందుకు పిల్లలను కంటోంది. ఆరోబిడ్డనూ కని ఆ నెత్తుటి గుడ్డునే ఇతరులకు విక్రయానికి పెట్టి దొరికిపోయింది' ఈ సంఘటన మన జిల్లాలోనే జరిగింది. ఇలాంటివి చాలా ప్రాంతాల్లోనూ సర్వసాధారణమైపోయాయి. పిల్లల్ని కంటూనే ఉంటే కుటుంబానికి తిప్పలు తప్పవని తెలిసీ మసలడం ఎప్పుడైనా ఎక్కడైనా దంపతుల సామాజిక బాధ్యత. మంది ఎక్కువైతే మజ్జిగ పలచన అని అందరికీ తెలియజెప్పి సురక్షిత కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించేలా చేయడం ప్రభుత్వ కర్తవ్యం.

యావత్ ప్రపంచాన్ని.. భయపెడుతున్న అతిపెద్ద సమస్య జనాభాపెరుగుదల. మరో పదేళ్లలో అదనంగా వంద కోట్ల జనాభా పెరుగుతుందన్న అంచనాలు పెనుప్రమాదాల సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందన్న హెచ్చరికలు చేస్తున్నాయి. ఓ వైపు పేదరికం, జనవృద్ధి రేటు భవిష్యత్‌లో దేశం పాలిట శాపంగా పరిణమించబోతుందని ఆందోళనలను వెల్లువెతుతున్నాయి. జనాభా పెరిగితే అభివృద్ధి

(మిగతా 6వ పేజీలో)



గోదావరి గలగల

- భద్రాద్రి వద్ద పెరుగుతున్న నీటిమట్టం
- నేడు 43 అడుగులకు.. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం

భద్రాచలం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలతో గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. భద్రాచలం వద్ద బుధవారం 24.1అడుగుకు చేరిన తరువాత క్రమంగా 23 అడుగులకు తగ్గింది. అయితే గురువారం మళ్లీ పెరిగి మధ్యాహ్నం 3 గంటలకు 24.1అడుగుకు చేరుకుంది. రాత్రి 11 గంటలకు 29.2 అడుగుల నీటిమట్టం నమోదైంది. కాగా శుక్రవారం నాటికి భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం 43 అడుగులకు చేరే అవకాశం ఉండడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. కాగా ఈ సీజన్‌లో తొలిసారి భద్రాచలం వద్ద స్నానఘట్టాలు గోదావరి నీటిలో మునిగాయి. నీటిమట్టం క్రమేపీ పెరుగుతుండటంతో స్నానఘట్టాల వద్ద నీటిపారుదల శాఖ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే గజ ఈతగాళ్లను సైతం సిద్ధం చేశారు. ఈ సీజన్‌లో తొలిసారి గోదావరి 25అడుగులను దాటడంతో మహిళలు పుణ్యస్నానాలు చేసి దీపాలను వెలిగించి గోదావరిలో వదిలారు.

ఇంజనీర్ల కృషి.. భవితకు దిక్సూచి

- అద్భుత కట్టడాలు.. చెరగని జ్ఞాపకాలు
- చారిత్రక నిర్మాణాల రూపకర్త, తెలంగాణ ఇంజనీర్ల పితామహుడు నవాజ్ బహదూర్



నేడు తెలంగాణ ఇంజనీర్ల దినోత్సవం

ఖమ్మం కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఒక ప్రాంతం ఏ రంగంలో అభివృద్ధి సాధించాలన్నా ఇంజనీర్ల పాత్ర కీలకం. ప్రపంచంలో అత్యధిక ఇంజనీర్లు ఉన్న దేశాల్లో భారత్ ముందు వరసలో ఉంటుంది. దేశంలో ఏటా లక్షలాది ఇంజనీర్లు తయారవుతున్నారు. వైద్యులు వ్యక్తికి చికిత్స చేస్తే.. ఇంజనీర్లు సమాజానికి ఉపయోగపడే సేవలందిస్తారు. తెలంగాణ ఇంజనీరింగ్ పితామహుడిగా పేరుగాంచిన నవాబ్ అలీ నవాజ్ జంగ్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోకి ఇంజనీర్ల ప్రతిభకు అద్దంపట్టే కట్టడాలు, తమ ప్రతిభతో జిల్లాకు పేరు తీసుకొస్తున్న వారి గురించి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం ఇది..

నవాజ్ అలీ నవాబ్ జంగ్ జూలై 11, 1877న హైదరాబాద్‌లో జన్మించారు. తండ్రి దాఫ్తర్ ముల్కీలో సహాయ కార్యదర్శిగా పనిచేసేవారు. శాలిబండలోని శేఖర్‌గంజ్‌లో నివసించే నవాబ్ జంగ్ సెయింట్ జార్జ్ స్కూల్లో చదివారు. అనంతరం నిజాం కాలేజీలో విద్యాభ్యాసం సాగించారు. 1896లో నిజాం ప్రభుత్వం స్కాలర్‌షిప్‌ను అందించి ఇంగ్లాండ్‌కు పంపించింది. అక్కడి కూపర్స్ హిల్ కళాశాలలో సివిల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ బ్రాంచిలో ఇంజనీరింగ్‌ను పూర్తిచేశారు. తిరిగి హైదరాబాద్‌కు వచ్చిన అనంతరం 1899లో పబ్లిక్ వర్క్స్ శాఖలో (పీడబ్ల్యూడీ) టెలిఫోన్స్ విభాగాల్లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా బాధ్యతలను చేపట్టారు.


● 1908వ సంవత్సరంలో భాగ్యనగరానికి వరదలు వచ్చి ప్రాణనష్టం సంభవించింది. దీంతో వరద ప్రవాహం వ్యవస్థను మెరుగుపరిచేందుకు మద్రాస్ నుంచి మోక్షగుండం విశ్వేశ్వరయ్యను అప్పటి ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ రప్పించారు. విశ్వేశ్వరయ్య సలహాలు సూచనలతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌కు నవాబ్ జంగ్ డిజైన్ చేశారు. ఆ తర్వాత ఆయన మూసీనదిపై జలాశయాలు నిర్మించారు. ఆ తర్వాత హైదరాబాద్ నగరానికి వరద ముప్పును తప్పించగలిగారు.

● ఆయన హయాంలోనే ఆర్ట్స్ కళాశాల, అసెంబ్లీ భవనం, జూబ్లీహాల్, ఢిల్లీలోని బాద్‌హౌజ్ వంటి చారిత్రాత్మక నిర్మాణాలు పూర్తిచేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య కంటే 13 ఏళ్ల చిన్నవాడైన అలీ హైదరాబాద్‌లో పలు చారిత్రాత్మక కట్టడాలకు డిజైన్ చేసి ప్రతిభను కనపరిచినందుకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ప్రశంసలు అందుకున్నాడు. జంగ్ ప్రతిభను తెలుసుకుని బాంబే ప్రభుత్వం 1929లో ఆహ్వానించింది. ఈ మేరకు సుక్కూరు బ్యారేజి నిర్మాణానికి విశ్వేశ్వరయ్యతో ఆర్థిక సాంకేతిక అంశాల్లో సహకారాన్ని అందించి ప్రశంసలు అందుకున్నారు.

అంతటి ప్రతిభాపాటవాలు కలిగిన ఇంజనీర్‌గా దేశానికి సేవలు చేసిన భాగ్యనగర్ ఇంజనీర్ నవాజ్ అలీ నవాబ్ జంగ్ జయంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఇంజనీర్ల దినోత్సవంగా నాలుగేళ్లుగా నిర్వహిస్తూ వస్తోంది.

నూరేళ్ల వారధి..!

నవాజ్ అలీ నవాబ్ జంగ్ హయాంలోనే ఖమ్మం మున్నేరుపై వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టుకుంది. దాదాపు వందేళ్ల క్రితం ఆయన కృషితో నిర్మించిన ఆ కట్టడం చెక్కు చెదరకుండా జిల్లా వాసులను కట్టిపడేస్తుంది. ఇటీవలె 40 అడుగుల ఎత్తున మున్నేరుకు వరద వచ్చినా వందేళ్ల క్రితం నిర్మించిన వంతెన చెక్కుచెదరకుండా సేవలందిస్తోంది. ఆయన ప్రత్యేకంగా ఖమ్మం నగరానికి రాకపోయినప్పటికీ ఆయన హయాంలోనే మున్నేటిపై వంతెన నిర్మాణాన్ని చేపట్టినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఖమ్మం మున్నేరు నదిపై నిర్మించిన వారధికి నూరేళ్లు దాటాయి. ప్రజలు, వాహన రాకపోకలకు సజీవ సాక్ష్యం ఈ వంతెన. నిజాంకాలంలో నిర్మించిన ఈ వంతెన రాళ్లతో నిర్మించారు. 350 మీటర్ల పొడవుతో 6 మీటర్ల వెడల్పుతో నిర్మించిన ఈ వంతెన ఇప్పటికీ చెక్కుచెదరలేదు. నాటి ఇంజనీర్ల పనితీరుకు ఈ వంతెన సాక్షిభూతంగా నిలుస్తోంది. మొత్తం 19 ఖానాలు, 20 పిల్లర్లతో నిర్మించారు. 3లక్షల క్యూసెక్కుల వరదనీరు మున్నేటి నుంచి ప్రవహిస్తున్నా.. నేటికి సజీవంగా ఉంది. సూర్యాపేట, హైదరాబాద్ రాష్ట్రీయ రహదారిపై ఉన్న ఈ వంతెనపై నిత్యం వేలాది వాహనాలు ప్రయాణం సాగిస్తున్నా.. వంతెనకు నిర్మించిన ఏఒక్క రాయి కూడా కదలకుండా ఉన్నాయంటే ఎంతటి పరిజ్ఞానంతో నిర్మించారో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇటీవలె సూర్యాపేట-దేవరపల్లి రహదారి జాతీయ రహదారిగా మారిన నేపథ్యంలో మున్నేరు వంతెనకు ప్రత్యామ్నాయంగా రూ.180 కోట్లతో తీగల వంతెన నిర్మాణాన్ని చేపట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం తీగల వంతెన నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి.



నవాబ్‌అలీ నవాజ్ జంగ్

ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో మెగా డ్రైవ్

- భద్రాద్రి జిల్లాలో ఒకేరోజు 503ఎకరాల్లో మొక్కలు నాటే కార్యక్రమం
- పంటతో దీర్ఘకాలిక ఆదాయం : ఆయిల్‌ఫెడ్ డివిజన్ అధికారి

అశ్వారావుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో టీజీ ఆయిల్‌ఫెడ్ అధికారులు గురువారం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. రైతులకు అధిక ఆదాయాన్నిచ్చే పామాయిల్ తోటలను వేగంగా విస్తరింపజేసేందుకు అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ డివిజన్ అధికారి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మెగా డ్రైవ్ చేపట్టారు. గురువారం ఒక్కరోజే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా 503.14 ఎకరాలలో 125మంది రైతులతో పామాయిల్ తోటలను వేయించారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో అక్కడి ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులతో జిల్లా వ్యాప్తంగా పామాయిల్ తోటలను వేశారు. అశ్వారావుపేట మండలంలో 96.79, ఆళ్లపల్లిలో 32, అశ్వాపురంలో 25.6, దమ్మపేటలో 152.44, ములకలపల్లిలో 22.99, పాల్వంచలో 55.54, చర్లలో 23.5, గుండాలలో 9, చుంచుపల్లిలో 15 ఎకరాలు, దుమ్ముగూడెంలో 20, లక్ష్మీదేవిపల్లిలో 45.28, ఇల్లెందులో 5 ఎకరాల్లో పామాయిల్ తోటలను వేసినట్టు ఆయిల్‌ఫెడ్ డివిజన్ అధికారి రాధాకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామాయిల్ తోటలను ఒకసారి వేస్తే 40 ఏళ్లపాటు ఆదాయాన్ని పొందవచ్చని, ప్రకృతి వైపరీత్యాలు, చోరీల భయం ఉండదని, ఎకరానికి రూ.4200లు చొప్పున ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, బ్యాంకులు రుణాన్ని అందజేస్తాయని, ఎకరానికి లక్ష నుంచి లక్షన్నర వరకు ఆదాయాన్ని తెస్తుందని, మూడు సంవత్సరాల వరకు అంతర పంటలను వేసుకొనే వీలుంటుందని, రైతులు పామాయిల్ తోటలు వేసుకొని మంచి ఆదాయాన్ని పొందవచ్చని ఆయన తెలిపారు. తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఆదేశాల మేరకు గురువారం భద్రాద్రి జిల్లాలో ప్రత్యేక మెగా డ్రైవ్‌ను చేపట్టడం జరిగిందని, దీనికి రైతుల నుంచి మంచి స్పందన లభించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీ ఆయిల్‌ఫెడ్ అధికారులు, సిబ్బంది, ఫీల్డ్ అధికారులు పాల్గొన్నారు.



పినపాకలో ప్లాంటేషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం

ఎరువుల షాపుల్లో తనిఖీలు

రికార్డులను పరిశీలించిన భద్రాద్రి జిల్లా వ్యవసాయాధికారి

దమ్మపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నాచారం, మొద్దులగూడెం, నాగుపల్లి గ్రామాల పరిధిలోని ఎరువుల షాపులను జిల్లా వ్యవసాయాధికారి బాబురావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులలో రికార్డులను, గోడౌన్‌లలో స్టాకును పరిశీలించారు. షాపు యజమానులకు పలు సూచనలు చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు అందజేయాలన్నారు. నకిలీ విత్తనాలపై ఆయన ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఎక్కువగా యూరియాను వినియోగిస్తున్నారని దీనివల్ల లాభం కంటే నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. పంటలకు వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు ఎరువులు వినియోగించుకొని దిగుబడులు సాధించాలని రైతులను కోరారు. అధిక రసాయన ఎరువులు వాడటం వల్ల రైతులకు ఖర్చు తప్ప లాభం ఉండదన్నారు. సాగుచేసిన పంటకు కావల్సిన ఎరువులను సూచనల మేరకు వేసుకోవాలని సూచించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం చేయటం వల్ల దిగుబడులు పెరగటంతో పాటు నాణ్యమైన ఉత్పత్తులు వస్తాయన్నారు. ఆయన వెంట ఏవో చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

జాతీయ విద్య, ఆరోగ్య సదస్సులో ఎమ్మెల్యే ఆదినారాయణ



అశ్వారావుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురువారం ఢిల్లీలో జరిగిన జాతీయ విద్య, ఆరోగ్య సదస్సులో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో పాల్గొనలసిందిగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆయన ఢిల్లీకి చేరుకొని గురువారం జరిగిన సదస్సులో పాల్గొని తన అభిప్రాయాలు వెల్లడించినట్టు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. జాతీయ స్థాయి సదస్సులో పాల్గొని తన ప్రతిభను చాటుకున్నారంటూ కాంగ్రెస్ నాయకులు, అభిమానుల్లో హర్షం వ్యక్తం అవుతుంది.

ఉద్యాన పంటల సాగుతోనే అధిక లాభాలు

డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన

జూలూరుపాడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రైతులు వాణిజ్య పంటలకు బదులుగా ఉద్యాన పంటల సాగు వైపు దృష్టి సారించాలని, ఈ పంటల ద్వారా అధిక లాభాలు పొందవచ్చని డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన అన్నారు. గురువారం ఆమె మండలంలోని వినోభానగర్ గ్రామంలో రైతు చిలుకూరి కృష్ణయ్య పొలంలో మునగమొక్కలను నాటారు. సూరారం, కొత్తూరులో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాల భవనాలను, వెంగన్నపాలెం, జూలూరుపాడు, పాపకొల్లు, భోజ్యాతండా గ్రామ పంచాయతీల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించారు. నర్సరీలలో 10 శాతం బ్యాగులు ఖాళీగా ఉండడంతో వాటిలో వెంటనే మొక్కలను నాటాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మునగ, నిమ్మ, జామ, మామిడి, పామాయిల్ తదితర ఉద్యాన పంటల సాగు చేపట్టే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తూ రాయితీలను అందిస్తుందన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మెయింటెనెన్స్‌ను కూడా చెల్లిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్లాంటేషన్ మేనేజర్ రాజు,ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, ఎంపివో తులసీరాం, ఈజీఎస్ మండల ఏపీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినోభానగర్‌లో మునగ మొక్కలను నాటుతున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన

వయోవృద్ధుల మల్టీ డే కేర్ సెంటర్ నిర్వహణకు దరఖాస్తుల స్వీకరణ



జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనిన

కొత్తగూడెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వయోవృద్ధుల కొరకు మల్టీ సర్వీసు డే కేర్ సెంటర్ నడిపేందుకు స్వచ్ఛంద సంస్థలు, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సంక్షేమశాఖ అధికారి జేఎం స్వర్ణలత లెనిన గురువారం తెలిపారు. మల్టీ సర్వీసు డే కేర్ సెంటరు నిర్వహించే వారు తెలంగాణ సొసైటీ రిజిస్ట్రేషన్ 2001, ద కంపెనీస్ యాక్టు 1956, ఇండియన్ ట్రస్ట్ యాక్టు 1882 ద్వారా రిజిస్ట్రర్ అయి ఉండాలన్నారు. ఎన్‌జీవో, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఓల్డ్ ఏజ్ హోమ్ లేదా చిల్డ్రన్స్ హోమ్, షెల్టర్ హోమ్స్ నిర్వహించడంలో కనీసం మూడు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. ఎన్జీవో, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ బ్లాక్ లిస్టులో ఉండటం ఫైనాన్సియల్ ఫ్రాడ్ కేసుల్లో ఉండటం వంటి దరఖాస్తులు తిరస్కరించబడునని, ఆసక్తి గల ఎన్జీవో, సీనియర్ సిటిజన్ అసోసియేషన్స్ దరఖాస్తులను జిల్లా సంక్షేమ శాఖ వారి కార్యాలయం ఐడీవోసీ పాల్వంచలో ఈ నెల 15వ తేదీ లోగా అందించాలని తెలిపారు. ఇతర వివరాల కొరకు 6301981960, 8331006010 సెల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

పదవులకు.. వడపోత!

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గస్థాయిలో ప్రభుత్వ నియామక పదవులకు అర్హత ఉన్న వారి పేర్లను ఎమ్మెల్యేలు, ఇతర నాయకుల నుంచి తీసుకోనున్నారు. మహబూబాబాద్ లోక్‌సభ ఇన్‌చార్జ్‌గా మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గాల్లో ఇన్‌చార్జ్‌లుగా ఉన్న పీసీసీ ప్రధాన కార్యదర్శులు ఎమ్మెల్యే మట్టా రాగమయి, మద్దినేని బేబి స్వర్ణకుమారి, నాగసీతారాములు ఆధ్వర్యంలో మండల కమిటీ , నియోజకవర్గ స్థాయిలో నామిటేడ్ పదవులకు పేర్లు ఎంపిక జరగనుంది. మండల కమిటీలకు సంబంధించి ప్రతీ మండలం నుంచి ఐదుగురి పేర్లను ఇప్పటికే పీసీసీకి పంపించారు.

నామినేటెడ్ పోస్టులకు ప్రతిపాదనలు..

నామినేటెడ్ పదవుల విషయంలో ప్రతీ నియోజకవర్గం నుంచి రెండు కంటే ఎక్కువ మంది పేర్లు ప్రతిపాదిస్తున్నారు. అయితే ఎవరు పేర్లు ఇస్తున్నారన్నది కమిటీలు గోప్యంగా ఉంచుతున్నాయి. పార్టీ మండల అధ్యక్ష పదవుల విషయంలో కనీసం మూడేళ్లు పార్టీలో ఉన్నవారినే అర్హులుగా నిర్ణయించారు. జిల్లా కమిటీ అధ్యక్ష పదవికి కనీసం ఐదేళ్లపాటు పార్టీలో పనిచేస్తున్న వారికి అవకాశమివ్వాలని నిర్ణయించారు. మధ్యలో చాలా కాలం పార్టీలో పనిచేసి వెళ్లిపోయి.. తిరిగి గత ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన వారి సీనియారిటీని.. మళ్లీ పార్టీలో చేరిన సమయం నుంచే లెక్కిస్తారు. దీంతో అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీలో చేరిన వారికి సంస్థాగత పదవులు దక్కే అవకాశం కనిపించడంలేదు.

ఎవరి ప్రయత్నాల్లో వారు..

12వతేదీ లోపు నామినేటెడ్ పదవుల జాబితా, 15లోపు మండల కమిటీ అధ్యక్షుల జాబితాను సిద్ధం చేసి పార్టీకి పంపించ బోతుండటంతో కాంగ్రెస్ కేడర్‌లో ఉత్కంఠ నెలకొంది. నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నవారు వాటిని దక్కించుకునేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. తమతమ ఎమ్మెల్యేల ద్వారా ప్రతిపక్షంలో పార్టీ కోసం తాము పడిన కష్టాన్ని, ఎన్నికల ముందు తాము అధికారంలోకి తెచ్చేందుకు చేసిన కృషిని వివరిస్తూ.. నామినేటెడ్ పదవులను తమకు ఇప్పించేలా చూడాలని ఒత్తిళ్లు చేస్తున్నారు. ఎవరికివారు తమ బయోడేటాలు, పార్టీ కోసం చేసిన పనులు, పోరాటాల వివరాలను తీసుకుని కాంగ్రెస్ కార్యాలయానికి వచ్చి ఇన్‌చార్జ్‌లు, పరిశీలకులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ఇదే సమయంలో ఎంపీలు, ఎమ్మెల్యేల సిఫార్సులు కూడా కీలకం కాబోతున్నాయి. ఇప్పటికే పలువురు తమ వారికి పదవులు దక్కేలా తెరవెనుక మంత్రాంగం నడిపిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు కేంద్రమాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి శుక్రవారం జిల్లా పర్యటనకు రానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

పనిచేసే వారికే పదవులు

కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ చల్లా వంశీచంద్‌రెడ్డి



వంశీచంద్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఖమ్మం, జూలై 10 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : పార్టీలో పనిచేసే వారికే పదవులు లభిస్తాయని, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో ఎలాంటి వర్గాలు లేవని, ప్రజాస్వామ్యం మాత్రమే ఉందని, అందరూ ఐక్యంగానే చేస్తున్నారని కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ చల్లా వంశీచంద్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్‌గా ఇటీవల నియమితులైన ఆయన.. గురువారం తొలిసారి ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఖమ్మం జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ సంస్థాగత ఎన్నికలతోపాటు ప్రభుత్వ నియామక పదవుల్లో నియోజకవర్గంలో ఇద్దరి కంటే ఎక్కువ మందిని గుర్తించి ఈనెల 12లోపు అధిష్ఠానానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. అలాగే మండల కమిటీ పదవికి ఇద్దరి చొప్పున ప్రతిపాదించి 15లోపు అందజేస్తామని, 50శాతం పదవుల్లో ఆయా సామాజికవర్గాల రిజర్వేషన్లతోపాటు మహిళలకు కూడా రిజర్వేషన్లు ఉంటాయని తెలిపారు. పార్టీలో మండల అధ్యక్ష పదవికి కనీసం మూడేళ్లు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవికి 5ఏళ్లపాటు పనిచేసిన అర్హత ఉండాలనే నిబంధన పెట్టారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నాటి అధికార పార్టీని ఎదిరించి ఆందోళనలు నిర్వహించిన వారికి, పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి ప్రాధాన్యం ఉంటుదన్నారు. నామినేటెడ్ పదవులకూ నియోజకవర్గాల స్థాయిలో రెండుకంటే ఎక్కువమంది పేర్లు ప్రతిపాదిస్తామని, ఇందుకు నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్‌కు ఉమ్మడి ఖమ్మం బలమైన జిల్లా అని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఈజిల్లా కీలక పాత్ర పోషించిందన్నారు. పార్టీలో అందరూ ప్రజాస్వామ్యబద్ధంగా తమ భావాలను చెప్పుకొంటారు తప్పా.. అవి ఘర్షణలు కావన్నారు. మండల, జిల్లా కమిటీల విషయంలో ఎలాంటి నిబంధనలు లేవని తెలిపారు. మండల కమిటీల నియామకం అనంతరం గ్రామ, బూత్‌స్థాయి కమిటీలను కూడా నియమిస్తామన్నారు. సంస్థాగత పదవుల్లో అవకాశం దక్కని వారికి త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశాలుంటాయన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోని నియోజవర్గాల్లో సంస్థాగత ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పీసీసీ నుంచి నియమితులైన వారు సమావేశాలు నిర్వహిస్తారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఖమ్మం అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సత్తుపల్లి ఎమ్మెల్యే, పీసీసీ ప్రధాన కార్యదర్శి మట్టా రాగమయి, పీసీసీ ప్రధాన కార్యదర్శులు కట్ల రంగారావు, మద్దినేని బేబి స్వర్ణకుమారి, నాగసీతారాములు, నగర అధ్యక్షుడు జావీద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి, పీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, మైనారిటీ సెల్ నాయకులు ముస్తాఫా, తదితరులు పాల్గొన్నారు.

‘మెటా ప్లస్’ మోసాలు మరెన్నో!



మెటాప్లస్‌పై సెమినార్ నిర్వహిస్తున్న నిర్వాహకులు (ఫైల్)

(5వ పేజీ తరువాయి)

చేతులెత్తేశారు. ఆ సమయంలో ఖమ్మం నగరంతోపాటు కారేపల్లి, తిరుమలాయపాలెం లాంటి చుట్టుపక్కల మండలాలకు చెందిన వందల మంది బాధితులు లబోదిబోమనాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే వ్యాలెట్ ఎత్తేసిన అంశం వెలుగులోకి వచ్చిన సమయంలో అది కేవలం ఉమ్మడి జిల్లా వరకు మాత్రమే ఉందని భావించినప్పటికీ.. తాజాగా కరీంనగర్‌కు చెందిన సైబర్ క్రైం పోలీసులు నమోదు చేసిన కేసు, చేపట్టిన విచారణతో జిల్లాకు చెందిన నవీన్, నజీర్‌లతో పాటు మరికొందరు నిర్వాహకులు ఉన్నట్టుగా తేలింది. మెటాప్లస్‌కు చెందిన బాధితులు ఇతర జిల్లాల్లోనూ ఉన్నట్టుగా స్పష్టమవుతోంది. కాగా బుధవారం మెటాప్లస్ వ్యాలెట్ నిర్వాహకులతో సంబంధం ఉన్న ఖమ్మం నగరానికి చెందిన తురగ రాజేంద్రమూర్తి(టీఆర్ మూర్తి)ని ఇటీవల కరీంనగర్ పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో మెటాప్లస్‌లో పెట్టుబడుల వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. అయితే గతంలోనే దీనిపై ఖమ్మం ఖానాపురం హవేలీ, వన్‌టౌన్, కారేపల్లి పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసిన పోలీసులు దానికి సంబంధించిన వారిలో కొందరిని ఇప్పటికే అరెస్ట్ చేయగా.. ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మరింత లోతుగా విచారణ చేయనున్నట్టు తెలుస్తోంది. ప్రధాన నిందితులను సైతం పట్టుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. మెటాప్లస్ మోసాలు ఖమ్మం, కరీంనగర్‌తోపాటు ఇంకెన్ని ఉన్నాయోనని, బాధితులుగా ఉన్న వారిలో చాలామంది బయటకు రావడంలేదన్న చర్చ జరుగుతోంది.

మోసం జరిగిందిలా..

డిజిటల్ కరెన్సీగా చలామణి అవుతున్న క్రిప్టో కరెన్సీకి సంబంధించి బిట్‌కాయిన్, ఇథేరియమ్, ట్రాన్ లాంటి పలు రకాల కాయిన్లు కొనుగోలు చేయడం ద్వారా ముున్ముందు రోజుల్లో దానికి విలువ పెరిగి రూ.లక్షలు, కోట్లు వచ్చే అవకాశం ఉందన్న ప్రచారం చేస్తున్నారు. అయితే ఆయా కాయిన్లను కొనుగోలు చేయడం కోసం పలు రకాల వ్యాలెట్లను ఉపయోగించాల్సి ఉంటుంది. అలా వ్యాలెట్లను ఉపయోగించి కాయిన్లను కొనుగోలు చేసే సమయంలోనే మోసగాళ్లు నగదును కొల్లగొట్టేస్తున్నారు. దొంగ వ్యాలెట్లను తయారుచేసి తాము ఇచ్చిన లింకుల ఆధారంగా వ్యాలెట్లను డౌన్‌లోన్ చేయించడం దాని ద్వారా పెట్టుబడులు పెట్టించడం ప్రస్తుతం క్రిప్టోమోసాల్లో జరుగుతున్న తంతు. తమకు చెందిన వ్యాలెట్లలో నగదు పెడితే.. పెట్టిన నగదు ఆధారంగా ఆదాయం ఉంటుందని చెప్పి పలు రకాల ప్యాకెజీలకు సంబంధించిన డెమోలను ఇచ్చి వాటిల్లో నగదు పెట్టేలా చేస్తున్నారు. అలా ‘మెటాప్లస్’ క్రిప్టో వ్యాలెట్‌లో ఏడు ప్యాకేజీలను ప్రకటించిన నిర్వాహకులు మొదటి నాలుగు ప్యాకేజీల్లో రెండింతలు, ఆ తర్వాత మూడు ప్యాకేజీల్లో మూడింతలు లాభాలను ప్రకటించారు. రూ.లక్షలోపు నగదు పెట్టిన వారికి పది నెలల్లో రెండింతలు, ఆపై పెట్టుబడి వారికి 15 నెలల్లో మూడింతలు నగదు తిరిగి ఇస్తామని ప్రకటించారు. ఆయా నగదును డాలర్ల రూపంలో లెక్కించి చెల్లించాలని, వాటిని ఏ సమయంలోనైనా విత్‌డ్రా చేసుకోవచ్చని, సౌదీ, దుబాయ్‌లలో సెలవు దినాల్లో మాత్రం కుదరదని చెప్పారు. ఆయా నగదును గోల్డ్ మైన్, స్క్రాప్ బిజినెస్‌లలో పెట్టడం ద్వారా లాభాలు వస్తాయని నమ్మించారు. అలా ఖమ్మం జిల్లాలో వెయ్యిమందికి పైగా రూ.100కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్టు ప్రచారం జరుగుతుండగా అదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఏపీలోని విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లోనూ బాధితులు ఉన్నట్టుగా తెలుస్తోంది. చైన్ లింకుల కారణంగా బాధితుల సంఖ్య పెరిగినట్టు స్పష్టమవుతోంది.

వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతి

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో క్రిప్టోకరెన్సీ వ్యాలెట్ల పేరుతో జరుగుతున్న దందాలను తొలుత ‘ఆంధ్రజ్యోతి’ ప్రధాన, జిల్లా సంచిక ద్వారా వెలుగులోకి తీసుకొచ్చింది. ట్రూ వ్యాలెట్, ట్రస్ట్ వ్యాలెట్, ఈఎస్పీఎన్ గ్లోబల్ లాంటి ఎన్నో వ్యాలెట్లలో జిల్లాకు చెందిన ఎంతోమంది సాధారణ, మధ్య తరగతి ప్రజలు పెట్టుబడులు పెట్టి మోసపోయిన విషయాన్ని పదుల సంఖ్యలో కథనాలు ప్రచురించింది. ఆ సమయంలో కొందరు బాధితులు అప్పటి సీపీ విష్ణు ఎస్ వారియర్‌ను కలవడంతో దాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ఆయా వ్యాలెట్ల ద్వారా మోసాలకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టారు. ఆ సమయంలో హైదరాబాద్‌లోని సైబర్ టీంతో కలిసి విచారణ నిర్వహించారు. విజయవాడకు చెందిన ఇద్దరు నిర్వాహకులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు. ఆ తర్వాత కాలంలో ‘మెటాప్లస్’గా మారి ప్రజల్లోకి వచ్చింది. ఒకరిద్దరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం అది కూడా చైన్ స్కీం పేరుతో మోసాలకు పాల్పడినదేనంటూ ‘ఈ మోసం.. యాప్ రూపం’ శీర్షికన మెటాప్లస్ మోసాన్ని ‘ఆంధ్రజ్యోతి’ వివరించింది. సదరు మోసంలో యాప్ నిర్వాహకులు ఖమ్మానికి చెందినవారు కావడం గమనార్హం. కాగా దాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ప్రత్యేక అధికారిని నియమించి విచారణ నిర్వహించారు. కాగా ప్రస్తుతం ఈ యాప్‌కు సంబంధించి లోతైన విచారణ కొనసాగుతోండటంతో బాధితులకు న్యాయం జరుగుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

‘గంజాయి కేసు’ బెదిరింపు ఘటనలో చర్యలు

ఖమ్మం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసు పెడతామంటూ మిర్చి వ్యాపారి వద్ద పనిచేసే ఓ గుమస్తాను బెదిరించిన ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏసీపీతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లపై ఖమ్మం సీపీ సునీల్‌దత్ చర్యలు తీసుకున్నారు. ఏసీపీని డీజీ కార్యాలయానికి అటాచ్ చేయగా, ఇద్దరు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇటీవల ఖమ్మం నగరంలోని రాజస్థాన్‌కు చెందిన ఓ మిర్చి వ్యాపారి వద్ద పనిచేసే గుమాస్తా వస్తుండగా త్రీ టౌన్ ప్రాంతం సుందరయ్య పార్కు సమీపంలో ఇద్దరు కానిస్టేబుళ్లు... సీటీసీ ఏసీపీ రవి గన్‌మెన్ నాగరాజు, డ్రైవర్ ఉపేందర్ అతడిని ఆపారు. గుమాస్తా వద్ద రూ.10లక్షలు గుర్తించి.. నగదు ఎక్కడి నుంచి తీసుకొస్తున్నావంటూ లెక్కలు అడిగారు. ఆ తర్వాత ‘గంజాయి విక్రయించి తీసుకొస్తున్నావని.. గంజాయి కేసులో ఇరికిస్తాం’ అంటూ బెదిరింపులకు పాల్పడి రూ.10లక్షల్లో నుంచి రూ.6 లక్షలు నగదును లాక్కొన్నారు. ఆ తర్వాత సదరు గుమస్తా.. విషయాన్ని తన యజమానికి చెప్పగా ఆయన వర్తక సంఘం దృష్టికి తీసుకెళ్లారు. వర్తక సంఘం పెద్దలు, పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో తీసుకున్న నగదును తిరిగిచ్చారు. కానీ విషయం బయటకు పొక్కి చర్చనీయాంశంగా మారడంతో సీరియస్‌గా తీసుకున్న పోలీసు అధికారులు దీనిపై అంతర్గతంగా విచారణ నిర్వహించారు. సీసీ కెమెరాలను సైతం పరిశీలించారు. ఈ నేపథ్యంలో సంఘటనతో ప్రత్యక్షంగా సంబంధం ఉన్న నాగరాజు, ఉపేందర్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ సునీల్‌దత్ ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో పాటు తొలుత నుంచి ఇందులో ఏసీపీ హస్తం ఉందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న సీటీసీ ఏసీపీ రవిని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

కార్యాచరణ లేక..

(5వ పేజీ తరువాయి)

కుంటుపడుతుందని, అభివృద్ధి దిశగా పయనించాలంటే ప్రతీ పౌరుడు జనాభా నియంత్రణకు కృషిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్న ప్రపంచ ఆరోగ్యసంస్థ పిలుపును అంతా పాటించాల్సిందే. జనాభా పెరుగుదలను అడ్డుకోలేకపోతే ప్రగతి సాధించలేమని, అది వృద్ధిరేటుకు అడ్డంకిగా ఉంటుందని తెలుసుకోవాలి. అంతేకాదు పేద వారికి సామాజిక,ఆర్థిక భద్రతను కల్పించడంలో ప్రభుత్వం మరింత శ్రమించాల్సి ఉంటుంది. ఇక కుటుంబనియంత్రణ కార్యక్రమాల ద్వారా జనవృద్ధిని సమర్థవంతంగా నివారించవచ్చనే సందేశాన్ని ప్రచారం చేయాల్సిన బాధ్యతను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ యంత్రాంగం సక్రమంగా నిర్వర్తించాలి. అప్పుడే ఆరోగ్యవంతమైన నవ సమాజం సాధ్యమవుతుంది.

● 2011 గణాంకాల ప్రకారం ప్రస్తుత ఖమ్మం జిల్లా మొత్తం జనాభా 14,02,639 కాగా వారిలో 6,99,124 మంది పురుషులు, 7,02,515 మంది స్త్రీలు ఉన్నారు. మొత్తం 3,82,929 కుటుంబాలున్నాయి.

● జిల్లాలో పుట్టుకల రేటు 24శాతం ఉండగా మరణాలరేటు 8శాతంగా ఉంటోంది.

● జనసాంద్రత చదరపు కిలోమీటర్‌కు 175 మంది స్త్రీ, పురుషుల నిష్పత్తి నమోదవగా.. 1003అక్షరాస్యతతో 65.95శాతంగా నమోదయ్యింది.

2011 లెక్కల ప్రకారం గణాంకాలు

మొత్తం జనాభా	26,25,430
ఎస్సీలు	4,85,454
ఎస్టీలు	6,83,977
బీసీలు	10,24,063
ఓసీలు	4,53,936
మైనార్టీలు	2,03,925

నేడు ప్రపంచ జనాభా దినం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జనాభా పెరిగిన తీరు..

ప్రతి పదేళ్లకోసారి దేశవ్యాప్తంగా జనాభా గణన చేపడతారు. 1951లో 5లక్షల నుంచి 10లక్షల లోపు జనాభా ఉండగా.. 1961 గణన నాటికి ఆ సంఖ్య 10లక్షల నుంచి 15లక్షలకు చేరింది. ఇక 1971లో 15లక్షలు నమోదవగా, 1981లో 15నుంచి 20లక్షలకు లోపు ఉంది. 1991లో 20నుంచి 25లక్షల లోపు ఉండగా.. 2001 నాటికి 25,78,927కి చేరింది. 2011 గణన ప్రకారం 26,25,430జనాభా ఉండగా.. ఇప్పటికి అది మరింత పెరిగి ఉంటుందని, 30లక్షలను దాటి ఉంటుందని అంచనా వేస్తున్నారు. తొమ్మిదేళ్లక్రితం తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేపట్టినా ఆ తర్వాత మళ్లీ చేపట్టలేదు. ఏడాదిన్నర క్రితం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇంటింటి సర్వే పేరుతో వివరాలు సేకరించింది. కానీ ఆ వివరాలను గోప్యంగానే ఉంచింది.

నీట్ రాష్ట్రస్థాయి ఫలితాల్లో న్యూవిజన్ విజయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ ప్రసాద్

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 10(ఆంధ్రజ్యోతి): నీట్ 2025 తెలంగాణ రాష్ట్ర ఫలితాలలో నగరంలోని న్యూవిజన్ జూనియర్ కళాశాల విద్యార్థిని మాచినేని. ఆకాంక్ష ఓపెన్ క్యాటగిరిలో 89వ ర్యాంకు, క్యాటగిరిలో పిల్లలమర్రి. సంహిత 29వ ర్యాంకు సాధించినట్లు కళాశాల చైర్మన్ సిహెచ్‌జీకె ప్రసాద్ తెలిపారు. కళాశాల నుంచి మొత్తం 75 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో ఏ, బీ కేటగిరిలో 40శాతం మంది మెడికల్ సీట్లు సాధించటానికి అవకాశం లభించిందని, 98 శాతం విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు.వివిధ క్యాటగిరిలలో కళాశాలకు చెందిన ముప్పా. వైష్ణవి 33, లకావత్. సాయి చరణ్ సింగ్ 86, బాణోత్. గోపీచెంద్ 91, మత్తినేని. బిందుప్రియ 163, మిన్హాజ్ ఆరా 178, భూక్యా. సాయిశృతి 264, రాజపుత్ర. శీతల్ 275, ఏర్పుల. సూర్యతేజ 297, తేజావత్. దివ్య 327, బానోతు. చైతన్య సాయి 345, గట్టిగుండె. అనుప్రియ 427, కాకి. వేదనందన 528, భూక్యా. అక్షిత 531, మేరుగు. వందన598, చింతరెడ్డి. హాసినీరెడ్డి 648, కంచెపోగు. సుష్మా 695, జర్పుల. ర్యాంకులు సాధించారని తెలిపారు. అనంతరం ర్యాంకులు సాధించిన విద్యార్థులను చైర్మన్, అకాడమిక్ డైరెక్టర్ కార్తిక్, డైరెక్టర్ గోపిచెంద్, ప్రిన్సిపాల్ బ్రహ్మాచారి, శ్రీనివాసరావులు అభినందించారు.

హార్వెస్ట్ విద్యార్థుల విజయదుందుభి


నైమాంజలి, రాణి ఉమా అలేఖ్య

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 10(ఆంధ్రజ్యోతి): నీట్ 2025 తెలంగాణ రాష్ట్ర ఫలితాలలో నగరంలోని హార్వెస్ట్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని విద్యా సంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డిలు తెలిపారు.కళాశాలకు చెందిన టీడీవీఎస్ఎస్ నైమాంజలి 194వ ర్యాంకు, గుడు. రాణి ఉమా అలేఖ్య 305, ఎండి. అన్షియా ముస్కన్ 951, సరోజ్ రాజ్‌పుత్ పురోహిత్ 1265, బానోత్. బార్గవ్ 6914, గుగులోత్. శ్రీమయి 9023 వం టి ర్యాంకులు సాధించారని తెలిపారు. 24 మంది బైపీసీ విద్యార్థులతోనే 8 మంది విద్యార్థులు వైద్య కళాశాలలో సీట్లు సాధించగలిగారని తెలిపారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శ్రీవిద్య

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 10(ఆంధ్రజ్యోతి): నీట్ 2025 తెలంగాణ రాష్ట్ర ఫలితాలలో నగరంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీవిద్య అన్నారు. కళాశాలకు చెందిన డి. దుర్గా గుజిరి 30, ఎల్. మనోహర్ 50, వైఎస్. స్ఫూర్తిక 81, బి. చందన 96, బి. రిషిత 134, కె. సాయిజశ్వంత్ 267, వి. రోమిత 300, జి. అక్షయ 320, జి. సాయి ప్రణవి 344, బి. భూమిక 351, జి. శ్రీనిధి జ్యోతిర్మయి 369, ఎస్. లహరి 408, డి. శ్రీలేఖ 434, జి. అర్షిత 435, పి. శ్రీవర్ష 445, డి. స్వరాజ్‌పాల్ 511, ఏ. లిఖిత 544, వి. ప్రియాంక 552, కె. తేజస్విని 559, ఎస్ రాజశేఖర్ 651, కె. శివాని వాగ్దేవి 660, ఎస్‌కే. షఫియా 671, తోపాటు మరికొందరు విద్యార్థులు 1000లోపు ర్యాంకులు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ బి. సాయిగీతిక, చేతన్ మాథూర్, వర్మ, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.


ఆలయం నుంచి సేవాయాత్రకు బయల్దేరిన దృశ్యం


నిరసన తెలుపుతున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

ధన్యజీవి దమ్మక్క

- భద్రాచలంలో వైభవంగా సేవాయాత్ర
- ములుగు జిల్లా వెంకటాపురంలోనూ నిర్వహణ
- తమను విస్మరించారని ఆదివాసీ జేఏసీ నిరసన

భద్రాచలం, జూలై 10(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం దమ్మక్క సేవాయాత్రను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీ సీతారామచంద్ర లక్ష్మణస్వాములకు ప్రత్యేక పూజలు చేసి అచంచలమైన భక్తి విశ్వాసాలతో రాముడి అనుగ్రహానికి పాత్రురాలైన పోకల దమ్మక్క పేరిట దేవస్థానం ఏటా ఈ దమ్మక్క సేవాయాత్రను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఆలయంలో పొగడ చెట్టు వద్ద ఉన్న దమ్మక్క విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మేళతాళాలతో రామయ్య కల్యాణోత్సవం నిర్వహించారు. అంతకు ముందు మేళతాళాలతో రామాలయం నుంచి చప్టా దిగువ, కల్యాణ మండపం రోడ్డు, ఏఎస్పీ ఆఫీసు రోడ్డు మీదుగా పోకల దమ్మక్క సెంటర్‌కు చేరుకొని అక్కడ ఉన్న దమ్మక్క విగ్రహానికి పూజలు నిర్వహించి సారెను సమర్పించారు. అలాగే తూము నరసింహదాసు, భక్తరామదాసు తానీషా విగ్రహాల వద్ద వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరగా రామాలయానికి చేరుకొని రామయ్య కల్యాణాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఇదిలా ఉండగా దేవస్థానం ఆధ్వర్యంలో ఈ సారి ములుగు జిల్లా వెంకటాపురంలోనూ దమ్మక్క సేవాయాత్ర నిర్వహించారు. ఇందుకోసం బుధవారం వెంక టాపురం వెళ్లిన దేవస్థానం వైదిక పరిపాలన అధికారులు, సిబ్బంది గురువారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

ఆదివాసీ జేఏసీ నిరసన

ఈసారి నిర్వహిస్తున్న దమ్మక్క సేవాయాత్రకు స్థానిక ఆదివాసీలమైన తమను దేవస్థానం అధికారులు విస్మరించారని ఆరోపిస్తూ ఆదివాసీ జేఏసీ నాయకులు పూనెం వీరభద్రం, పూనెం కృష్ణదొరలు దమ్మక సేవాయాత్ర సమయంలో భద్రాచలంలోని దమ్మక్క విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఏఈవో భవానీ రామకృష్ణారావుతో పాటు ఇతర అధికారులు వారికి సర్ది చెప్పడంతో దమ్మక్క విగ్రహానికి జరిగిన పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పునరావృతమైతే ఆదివాసీ సమాజం తీవ్రంగా ప్రతిఘటిస్తుందని వారు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా దమ్మక్క సేవాయాత్ర, భక్తశబరి యాత్రలను గిరిజన భక్తుల సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించాలని నిర్ణయించామని ఏఈవో తెలిపారు. గిరిజన భక్తుల సమక్షంలో వారు తెచ్చిన ఫలపుష్పాలతో స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని, కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యాలను ముమేకం చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

నిర్ణీత కాల వ్యవధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి


మాట్లాడుతున్న డైరెక్టర్ మధుసూదన్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 10(ఆంధ్రజ్యోతి): నిర్ణీత కాల వ్యవధిలోనే దరఖాస్తులు చేసిన రైతులకు వ్యవసాయ విద్యుత్ మోటర్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని, జాప్యం జరిగితే అందుకు గల కారణాలను ప్రతి నెల రివ్యూ చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ మధుసూదన్ ఆదేశించారు. చీఫ్ ఇంజనీర్ శ్రీరాజు చౌహాన్‌తో కలిసి ఆయన గురువారం ఖమ్మం జిల్లా పర్యాటనకు వచ్చారు. ఖమ్మంలో నిర్వహించిన విద్యుత్ ఉద్యోగుల రివ్యూ సమావేశంలో సమీక్షించారు. వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయాలు లేని విద్యుత్ పంపిణీ జరపాలని, ఒక్క నిమిషం కూడా విద్యుత్ అంతరాయం జరగొద్దని ఆదేశించారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌లకు లోడ్ ఎక్కువైతే కేపాసిటర్లు మార్చాలన్నారు. జిల్లా పర్యవేక్షక ఇంజనీరు ఇనుగుర్తి శ్రీనివాస్‌చారి, డీఈలు నంబూరి రామారావు, నాగేశ్వర రావు, ఎల్ రాములు, శ్రీనివాస్, భద్రుపవర్, వెంకటేశ్వర్లు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

గిరిజనులు అనారోగ్యానికి గురికాకుండా చూడాలి

ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో ఆదివాసీ గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులు అనారోగ్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారులపై ఉందని ఐటీడీఏ పీవో రాహుల్ స్పష్టం చేశారు. భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో గురువారం ఆయన సబ్ యూనిట్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అధికారులు తమ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికి తిరిగి వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి వైద్య చికిత్స అందేలా చూడాలన్నారు. ఏజెన్సీ పరిధిలోని 113 హైరిస్కు గిరిజన గ్రామాల్లో పారిశుధ్య చర్యలపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లోని గొత్తికోయలకూ వైద్య సేవలు అందించాలని కోరారు. ఎవరైనా అశ్రద్ధ చేస్తే సహించేది లేదన్నారు. గోదావరి వరదలు పెరుగుతున్న క్రమంలో ప్రసవసమయం సమీపించిన గర్భిణులను గుర్తించి సురక్షిత పీహెచ్‌సీలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో చైతన్య, మలేరియా అధికారి డాక్టర్ స్పందన పాల్గొన్నారు.

సాక్షి వద్దకే న్యాయాధికారి



ఖమ్మం లీగల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఓ కేసులో సాక్షిగా ఉన్న దివ్యాంగుడి వద్దకు స్వయం గా వెళ్లిన సంచార ప్రత్యేక న్యాయస్థాన న్యాయాధికారి బి.నాగలక్ష్మి అతడి నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. ఈ సంఘటన గురువారం ఖమ్మంలో జరిగింది. సింగరేణి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గతంలో నమోదైన ఓ కేసులో వికలాంగుడైన లావుడియా సురేష్ సాక్షిగా ఉన్నాడు. గురువారం కేసు వాయిదా ఉండటంతో ఎక్సైజ్ పోలీసులు అతడిని ఆటోలో కోర్టుకు తీసుకురాగా.. అతడి పరిస్థితి తెలుసుకున్న న్యాయాధికారి నాగలక్ష్మి అతడు ఉన్న ఆటో వద్దకు నేరుగా వెళ్లి సురేష్ నుంచి వాంగ్మూలాన్ని సేకరించారు. ఏపీపీఓగా రాహుల్, కోర్టు కానిస్టేబుల్ ఎస్.వెంకటేశ్వర్లు న్యాయాధికారికి సహకరించారు.


శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యులు, సిబ్బంది

భద్రాద్రి వైద్యశాలలో తొలి లాప్రోస్కోపిక్ సర్జరీ

భద్రాచలం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాల వైద్యులు ఓ మహిళకి లాప్రోస్కోపిక్ సర్జరీ నిర్వహించారు. ఈ వైద్యశాలలో తొలిసారి నిర్వహించిన ఈ లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సను లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కె.వెంకట్‌తో కూడిన వైద్యులు, సిబ్బంది బృందం విజయవంతంగా నిర్వహించింది. బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజరకు చెందిన పెరుమాళ్ల రమణకు పిత్తాశయంలో రాళ్లు ఉండటంతో లాప్రోస్కోపిక్ పద్ధతిలో శస్త్రచికిత్స నిర్వహించగా అది విజయవంతమైనట్లు వైద్యులు తెలిపారు. సుమారు రూ.2లక్షల ఖర్చయ్యే శస్త్రచికిత్సను చేయించుకునే స్థోమత లేకపోవడంతో వారు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణను సంప్రదించగా.. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఈ సర్జరీ నిర్వహించారు. తొలి లాప్రోస్కోపిక్ సర్జరీ చేసిన వైద్యులను డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు అభినందించారు.

సోలార్‌ప్లాంట్ల నిర్మాణంలో జాప్యం చేస్తే కాంట్రాక్టు రద్దు చేస్తాం

సింగరేణి సీఎండీ బలరాం హెచ్చరిక

కొత్తగూడెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి సంస్థ చేపట్టిన సోలార్ ప్లాంట్ల నిర్మాణాలను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని, నిర్మాణ పనుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న ఏజెన్సీల కాంట్రాక్టులు రద్దు చేసి బ్లాక్ లిస్టులో పెడతామని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం హెచ్చరించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో గురువారం సోలార్ ప్లాంట్ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షించారు. మొదటి దశలో ఇంకా పూర్తి చేయాల్సి ఉన్న 54.4 మెగావాట్ల ప్లాంట్ల నిర్మాణం, రెండో దశలో 67.5మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్ల నిర్మాణంపై చర్చించారు. నిర్మాణాల్లో జాప్యం చేస్తున్న నిర్మాణ ఏజెన్సీలపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బిల్లుల చెల్లింపుల్లో విషయంలో సంస్థ నుంచి జాప్యం లేదని, ఇచ్చిన పనులను అక్టోబర్ నెల నాటికి వేగంగా పూర్తి చేయాలని కోరారు. ప్లాంట్ల నిర్ణీతవ్యవధిలో పూర్తి చేయించకపోతే సంబంధిత అధికారుల పని తీరును వారి సర్వీసు రికార్డులో నమోదు చేస్తామని హెచ్చరించారు.

టపాసుల స్వాధీనం

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 10 (ఆంధ్రజ్యోతి):అక్రమంగా తరలిస్తున్న దీపావళి టపాసులను స్వాధీనం చేసుకున్నట్లు ఖమ్మం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. పాతబస్టాండ్ వద్ద గురువారం తనిఖీలు నిర్వహిస్తుండగా అద్దంకివారి వీధిలో నివసించే జంగాల. కిరణ్‌కుమార్‌ని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అనుమతులు లేకుండా తరలిస్తున్న రూ.90వేల టపాసులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై10 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం రైల్వే అండర్ బ్రిడ్జిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు గురువారం సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. భిక్షాటనం చేస్తూ రైల్వే అండర్ బ్రిడ్జిలో ఆహారం లేకపోవడంతోనే మృతి చెంది ఉంటాడని తెలుస్తుంది.

కార్మికుడి కోసం కొనసాగుతున్న గాలింపు

మణుగూరుటౌన్, జూలై10(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియలోని ఓసీ -2 గనిలో ఈపీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సుంకరి శ్రీనివాస్ బుధవారం రేగుల గండి చెరువులో గల్లంతైన విషయం తెలిసిందే. కాగా అతడి ఆచూకీ కోసం తహసీల్దార్ నరేష్, సీఐ పాటి నాగబాబు, అగ్నిమాపక సిబ్బంది. భద్రాచలం నుంచి వచ్చిన ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు గురువారం గాలింపు చర్యలను చేపట్టారు. గురువారం సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదు.

నా భూమిని మా అన్న కబ్జా చేశాడు

కామేపల్లిలో ఓ సోదరి నిరసన

కామేపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): తనకున్న భూమిని సొంత అన్ననే ఆక్రమించాడని ఓచెల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకొని నిరసనకు దిగింది. జాస్తిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 184లో 15ఎకరాల భూమి ఉందని తెలిపారు. తమ తండ్రి ఆభూమిని ఐదుగురు కుమార్తెల్లో ముగ్గురు రాసి ఇచ్చాడని పేర్కొంది. సోదరుడు, అతడి కుమారుడు ఆభూమిని ఆక్రమించి, అందులో కొంతభాగం అమ్మి, మిగత భూమిని అనుభవిస్తున్నారని తెలిపింది. దీంతో తహసీల్దార్ సుధాకర్ ఆమెను కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. లోతుగా విచారణ చేపట్టి న్యాయం చేస్తామని ఆమెకు హామీ ఇచ్చారు.

సింగరేణి గనులను ప్రైవేటీకరిస్తే ఊరుకోబోం..

- జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ఉపయోగం లేదు
- కనీసం కొత్తగూడేనికి ఎయిర్‌పోర్ట్ తీసుకురాలేకపోయారు
- బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా 22న రైల్‌రోకో
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- కొత్తగూడెంక్లబ్‌లో జాగృతి జిల్లాస్థాయి సమావేశం


కార్యక్రమంలో బోనమెత్తిన కల్వకుంట్ల కవిత

కొత్తగూడెం, జూలై 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటీకరిస్తే ఊరుకోబోమని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. గురువారం కొత్తగూడెంలోని కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన తెలంగాణ జాగృతి జిల్లాస్థాయి సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేయలేదని విమర్శించారు. గతంలో రైతులు, ప్రజలు ఏం అడగకుండానే అన్ని సంక్షేమ పథకాలు నాటి సీఎం కేసీఆర్ అందించారన్నారు. ఇప్పుడు రైతులకు కనీసం విత్తనాలు, పురుగుమందులు కూడా దొరకడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తరుచూ ఢిల్లీ వెళ్లి సోనియా, రాహుల్ జపం చేయడం తప్ప ప్రజల కోసం చేస్తున్నదేమీలేదన్నారు. సింగరేణి సంస్థ కేసీఆర్ హయంలోనే అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సింగరేణి సంస్థను పట్టించుకోవడం లేదన్నారు. సింగరేణిని ప్రైవేటీకరిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. వాస్తు భయంతో సెక్రటరియెట్‌కు కూడా రాని సీఎం రేవంత్‌రెడ్డి మీడియా ముందు సవాళ్లు విసురుతారని ఎద్దేవాచేశారు. మహిళలకు ఇచ్చిన హామీలపై పోలీసుకమాండ్ సెంటర్‌లో చర్చ పెట్టుకుందామా అని రేవంత్‌రెడ్డికి కవిత సవాల్ విసిరారు. కనీసం జై తెలంగాణ అనలేని వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని విమర్శించారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కాలుష్యాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా కొత్తగూడెంలో ఇప్పటి వరకు విమానాశ్రయం ఏర్పాటు చేయలేకపోయారన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో విమానాశ్రయ ఏర్పాటు కోసం ప్రయత్నం చేస్తానని, ఏపీలో కలిసిన గ్రామాలను తెలంగాణలో కలిపేందుకు పోరాటం చేస్తామన్నారు. భద్రాద్రి రామయ్య దేవస్థానం ఈవోపై దాడి, రాములవారి భూముల గురించి ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖరాశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేసిన ఆమె.. బీసీలకు మద్దతుగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈ నెల 22న రాష్ట్రవ్యాప్తంగా రైల్‌రోకో ఉద్యమానికి పిలుపునిచ్చామన్నారు. బీసీ బిల్లుకు మద్దతు ఇవ్వాలని సీపీఐని అడిగితే ఇప్పటి వరకు స్పందించలేదని, అలాంటి సీపీఐ తెలంగాణకు అవసరమా అనే విషయం కొత్తగూడెంలోని బీసీ బిడ్డలు ఆలోచన చేయాలన్నారు. నేటి ప్రభుత్వం సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి హక్కులను గాలికి వదిలేసిందని, నాడు కేసీఆర్ డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చి సింగరేణి కార్మికుల కుటుంబాలను, సంస్థను కాపాడారన్నారు. భద్రాచలం పరిసర ప్రాంతాల్లో ఐటీసీ కర్మాగారం వల్ల కాలుష్యం పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి ముందు ఉద్యమాల కెరటం వీరన్నకు వివిధ సంఘాల నాయకులు జాగృతి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. సమావేశంలో జాగృతి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాధవి, నాయకులు పవన్, గోపు సదానందం, ఎండి. హుస్సేన్, బుద్ది మధుసూదన్‌రావు, భూపతి శ్రీనివాసరావు, రవి, శ్రీనివాసరావు, ఇర్ఫాన్, టీబీజీకేఎస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, రాజేంద్ర ప్రసాద్, రెంటపల్లి మాధవీలత, సింధు తపస్వీని, మధుబాబు, ప్రసాద్‌గౌడ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

టేకులపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్యాతండా వద్ద నాలుగు కేజీల గంజాయిని పట్టుకున్నట్టు టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్ తెలిపారు. టేకులపల్లి పోలీసుల కథనం ప్రకారం గురువారం టేకులపల్లి ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో వెంకట్యాతండ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. నల్గొండ జిల్లా మర్రిగూడ గ్రామానికి చెందిన దుంప ప్రసాద్ తన ఆటోలో నాలుగు కేజీల గంజాయిని సంచులలో తన గ్రామానికి తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. టేకులపల్లి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. ఈ తనిఖీల్లో టేకులపల్లి ఎస్సై రాజేందర్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలం: భద్రాచలంలోని కూనవరం రోడ్డులో గురువారం 8.85 కేజీల గంజాయిని ఖమ్మం ఎక్సైజు ఎన్‌ఫోర్సుమెంటు సీఐ సీహెచ్.శ్రీనివాస్ స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. ఆర్టీఏ కార్యాలయం సమీపంలో హైదరాబాద్‌కు చెందిన మునావత్ మోహన్‌నాయక్, గంటా పవన్‌కుమార్, రమావత్ గణేష్ అయ్యప్పనాయక్, ఆకుల దర్శిత్ చంద్రను అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలించి విక్రయించేందుకుప్రయత్నిస్తున్న క్రమంలో భద్రాచలం వద్ద 8.85 కేజీల గంజాయి పట్టుకున్నామన్నారు. దీనివిలువ రూ.4.50లక్షలు ఉంటుందని తెలిపారు. వారినుంచి మూడు సెల్‌ఫోన్లు, రెండుబైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో బాలు సుధీర్ వెంకటేశ్వర్లు, హనుమంతరావు, వీరబాబు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లిలో ఆరు ఆర్ఎంపీ క్లీనిక్‌ల సీజ్

కామేపల్లి, జూలై10 (ఆంధ్రజ్యోతి): కామేపల్లి, జాస్తిపల్లిలో ఆరు ఆర్ఎంపీ క్లీనిక్‌లను ఖమ్మండీఎంహెచ్‌వో కళావతిబాయి సీజ్ చేశారు. కామేపల్లి మండల కేంద్రంలో నాలుగు, జాస్తిపల్లిలో రెండు కేంద్రాలను సీజ్ చేశారు. గ్రామాల్లో విచ్చలవిడిగా హెవి యాంటి బయటిక్స్ స్టెరాయిడ్స్ మందులు ఉపయోగిస్తున్నారని ఆర్ఎంపీలను హెచ్చరించారు. మెడికల్ షాపుల్లో సర్టిఫికెట్ కలిగి ఉన్న వారు మాత్రమే మందులు విక్రయించాలని సూచించారు. అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సూచించారు. ఈ తనిఖీలో డీఐఓ చందు నాయక్, పీహెచ్‌సీ వైద్యులు శిరీష, సీహెచ్ఓ సుధారాణి, హెచ్ఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఖమ్మంరూరల్, జూన్10(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంతో రోడ్డుపై డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి.ఈసంఘటన ఖమ్మంరూరల్ మండలం, మద్దులపల్లి వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఏపీలోని జగ్గయపేట మండలం మల్కాపురం గ్రామం అంబోజి నవదేవ్(24), ముదిగొండ మండలం గోకినపల్లికి చెందిన నరేందర్ స్నేహితులు.. వీరి ద్విచక్రవాహనంపై సూర్యాపేటలోని ఓఫంక్షన్‌కు వెళ్లారు. తిరిగి ఖమ్మం వస్తుండగా మార్గం మధ్యలోని మద్దులపల్లి వద్ద డివైడర్‌ను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో వినయ్ అక్కడికక్కడే మృతిచెందగా, నరేందర్ తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు 108లో నరేందర్‌ను ఖమ్మం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దొంగ అరెస్ట్: రిమాండ్‌కు తరలింపు

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై 10(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని రేవతి సెంటర్‌కు చెందిన దొన్‌వాన్ ప్రేమ్‌కుమార్ అనే పాతనేరస్తుడిని ఖమ్మం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు కొన్నిసంవత్సరాలుగా ఇళ్లలో పలు దొంగతనాలు చేస్తూ అనేకసార్లు జైలుకు వెళ్లివచ్చాడు. తిరిగి ఈ ఏడాది జనవరిలో మామిళ్లగుడెం, వెంకటేశ్వరస్వామి ఆలయంలో కొంతనగదు, ద్వారాకనగర్‌లో బంగారు వస్తువులు దొంగిలించాడు. ఏప్రిల్‌లో ఖమ్మం సర్దార్‌పటేల్ స్టేడియం వద్ద ఒక వ్యక్తి నడిసి వెళ్తుండగా అతడి వద్ద గల రెండు బంగారు ఉంగరాలను దొంగిలించాడు. వరదయ్యనగర్‌లో ఒక అపార్టుమెంట్‌లో బంగారు వస్తువులను దొంగిలించాడు. బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు. మొత్తం 155గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు.వీటివిలువ సుమారు రూ.7.50 లక్షలు ఉంటుందని తెలిపారు.

మంత్రుల వేతనాలకు ఆర్థిక ఇబ్బందులు లేవా ?

- విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజురీయింబర్స్‌మెంట్‌పై ఎందుకీ వివక్ష
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు
- బకాయిలు చెల్లించాలని కలెక్టరేట్ ముట్టడి


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

ఖమ్మంసంక్షేమవిభాగం,జూలై10(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల వేతనాలు, సౌకర్యాలకు లేని ఆర్థిక ఇబ్బందులు పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల చెల్లింపులకే గుర్తుకొస్తుందా అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు ఆరోపించారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో గురువారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు భారీగా రావటంతో పాటుగా నిరసన సందర్భంగా పోలీసులకు నాయకులకు తోపులాట చోటు చేసుకొవటంతో ఉద్రిక్తతకు దారి తీసింది. ఈసందర్భంగా తాళ్ల నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన బకాయిలు భిక్ష కాదని విద్యార్థుల హక్కుగా కొట్లాడి తెచ్చుకుంటామన్నారు. 2019నుంచి విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు మంజూరు కాకపోవటంతో నిరుపేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5,358 కోట్లు బకాయిలు చెల్లించాలని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారిన విద్యార్థులకు రావాల్సిన బకాయిలు మాత్రం ఇవ్వలేదన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తిట్టిన నేటి మంత్రులు ఇప్పుడేందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో 13లక్షల మంది ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీ విద్యార్థులపై బకాయిల ప్రభావం పడిందన్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవటంతో విద్యార్థుల తల్లి,దండ్రుల నుంచి యాజమాన్యాలు వసూళ్లు చేస్తున్నాయని ఆరోపించారు. డబ్బులు ఇవ్వలేని విద్యార్థుల ఓరిజనల్ ధృవపత్రాలు ఇవ్వటం లేదన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శిలు సుధాకర్, తుడుం ప్రవీణ్, నాయకులు వి రాజు, డీ వెంకటేష్, వరుణ్, హరీష్, మణికంఠ, వినోద్, సుశాంత్, సాయికుమార్, ప్రేమ్‌కుమార్, సుకన్య, ప్రవళిక, భాను, త్రినాథ్, మనోజ్, శశాంక్, సాయి, కార్తీక్, నవీన్; సాత్విక, శ్రీలత, నవ్య, భవాని, రమ్య పాల్గొన్నారు.





వీడీవోస్ కాలనీ సాయిబాబా ఆలయంలో పూజలోపాల్గొన్న భక్తులు

జీపీవో పోస్టులు టీఎస్‌పీఎస్‌సీతో భర్తీ చేయాలి



నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయితీ పోస్టులను టీఎస్‌పీఎస్‌సీతో(తెలంగాణ స్టేట్‌పబ్లిక్ సర్వీస్ కమీషన్) భర్తీ చేయాలని కోరుతూ గురువారం నగరంలోని గ్రంథాలయం ముందు జిల్లాలోని నిరుద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పరిపాలనా అధికారి పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వం వీఆర్‌ఓలతో గ్రామ పరిపాలన అధికారుల పోస్టులను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేసిందని, మళ్లీ నిన్న మిగిలి ఉన్న పోస్టులను వీఆర్‌ఓలతో నింపుతమని నోటిఫికేషన్ చేసిందని వెంటనే నోటిఫికేషన్ నిలిపివేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే జీపీఓ పోస్టులను టీఎస్‌పీఎస్‌సీతో భర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు కొండల్‌రావు, నరసింహాచారి, శ్రీనివాస్ రెడ్డి, పుష్ప, మమత తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులకు సముచిత స్థానం కల్పించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై10(ఆంధ్రజ్యోతి): జనాభాలో సింహభాగం ఉన్న మున్నూరు కాపులకు రాజకీయపార్టీలు సముచిత స్థానం కలిపించాలని మున్నూరుకాపు సంక్షేమ సంఘం సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ అన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని 27వ డివిజన్ నూతన కమిటీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం శ్రీనివాసనగర్‌లో నిర్వహించారు. ఈకార్యక్రమంలో మున్నేరుకాపు సీనియర్ నాయకులు కొత్త సీతారాములు, మెంతుల శ్రీశైలం, మలిశెట్టి వెంకటేశ్వర్లు, కనకం జనార్ధన్ యర్రా అప్పారావు, తోట వీరభద్రం, మాటేటి రవి తదితరులు పాల్గొన్నారు.

18 అడుగులకు చేరిన పాలేరు జలాశయం

కూసుమంచి, జూలై10 (ఆంధ్రజ్యోతి): పాలేరు జలాశయం జలకళను సంతరించుకుంది. గరిష్ఠ నీటిమట్టం 23అడుగులకుగాను 18అడుగులకు చేరుకుంది. ఇటీవల తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ డ్యాం నుంచి నీటిని విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో గత శుక్రవారం డ్యాం నుంచి 3500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా, 3000క్యూసెక్కుల నీరు చేరుతోంది. దీంతో వెలవెలబోయిన జలాశయం కళకళలాడుతోంది. అదేవిధంగా పాలేరు పాతకాల్వకు జలాశయం నుంచి వానాకాలం సాగునిమిత్తం 100క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాగా పాలేరు జలాశయం వద్ద సాగర్ ఎడమకాల్వపై 132 కిలోమీటరు వద్ద చేపట్టిన అండర్‌టన్నెల్((యూటీ)స్లాబు నిర్మాణం పూర్తయింది. సుమారు 73మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో నిర్మించారు. ఖమ్మం సర్కిల్ ఎస్‌ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, డీఈఈ మధవి పనులను పర్యవేక్షించారు. మరోవారం రోజుల్లో యూటీ పనులు పూర్తిచేస్తామని, ఎప్పుడు సాగర్ జలాలు విడుదల చేసినా సిద్ధంగా ఉంటామని ఖమ్మం సర్కిల్ ఎస్‌ఈ తెలిపారు.

ఘనంగా గురుపౌర్ణమి

సాయిబాబా ఆలయాలకు పోటెత్తిన భక్తులు, పలు చోట్ల అన్నదానం



జలాంజనేయస్వామి ఆలయంలో..



గుట్ట సాయిబాబా ఆలయంలో..

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి వేడుకలు గురువారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. సాయిబాబా ఆలయాలు సాయినామస్మరణతో మారుమోగాయి. జిల్లాలోని రఘునాథపాలెం, వైరా, పెద్దతండ, రంగనాయకులగుట్ట, గాంధీచౌక్, మామిళ్లగుడెం, వీడీఓస్‌కాలనీ, ప్రశాంతినగర్ తదితర సాయిబాబా ఆలయాలలో గురువారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం అందించారు. నగరంలోని శ్రీకృష్ణసామి ఆశ్రమంలో బాబాకు ప్రత్యేకంగా పంచామృతాలు పండ్లరసాలు, సుగుంధద్రవ్యాలు, వివిధ నదీజలాలచే అభిషేకం, 108 లీటర్ల గోక్షీరాభిషేకం, గులాబీ పూలతో సహస్రనామార్చన, మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ లగడపాటి. రామారావు, ప్రధాన కార్యదర్శి సిద్దంశెట్టి. నాగమణి, పాల్గొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వంశీచందర్ రెడ్డి నగరంలోని వీడీవోస్ కాలనీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.పలు ఆలయాలలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: పోలేపల్లిలోని సాయిబాబా ఆలయంలో ఎస్ఆర్ కనస్ట్రక్షన్స్ ఛైర్మన్ మన్నేటి నాగేశ్వరరావు, శ్రవంతి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని ఆరెంపులలో ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాలలో ఆలయ ఛైర్మన్ తుల్లూరి మోహన్‌రావు, కటకం బాబు, శ్రీసిటీ ఛైర్మన్ గరికపాటి వెంకట్రావు, అంజనేయప్రసాద్, శివా, రవితేజా, సత్యనారాయణ, ప్రమోద్ రెడ్డి, పాటి రవి, బాలు, ముకేష్, పోట్ల శ్రీనివాస్, రాజా, జూలకంటి శ్రీనివాస్, నవీన్, రమేష్, కట్టా సుధాకర్, కృష్ణ, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో గురువులకు సత్కారం

ఖమ్మంమార్కెట్: బీజేపీకార్యాలయంలో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. పలువురు గురువులను, ఉపాధ్యాయులను, వేద పండితులను, సంప్రదాయ కళల మాస్టర్లను జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సన్మానించారు. మేకల నాగేందర్, అల్లిక అంజయ్య, గెంటేల విద్యాసాగర్, సదర్శన్ మిశ్రా, మందడపు సుబ్బారావు పాల్గొన్నారు.



మామిళ్లగూడెంలో..



సాయిబాబా ఆలయంలో పూజలో ఎంపీ రవిచంద్ర







మామిళ్లగూడెంలో భక్తుల క్యూ, వీడీవోస్ కాలనీ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నేత వంశీచంద్‌రెడ్డి, పొలేపల్లిలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు దంపతులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఖమ్మం,జూలై10(ఆంధ్రజ్యోతిప్రతినిధి): అనారోగ్యం పాలై ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితులకు తన సిఫారసు మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గురువారం పంపిణీ చేశారు. బుర్హాన్‌పురంలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 13 మంది బాధితులకు వీటిని అందజేశారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు శీలంశెట్టి వీరభద్రం, తోట రామారావు, బీఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటరమణ, పగడాల నరేందర్, నేలకొండపల్లి మండలం రాజారంపేట సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంత నాసిరకమైన టైల్స్ వేస్తారా?

టీఎస్ఎంఐడీసీ ఇంజనీర్లపై అదనపు కలెక్టర్ శ్రీజ ఆగ్రహం



మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్,జూలై10(ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆస్పత్రిలో నిసిరకమైన టైల్స్.. నిర్మాణంపై అదనపు కలెక్టర్ శ్రీజ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత పల్చగా ఉన్నాయి.. సాయంత్రంకల్లా టైల్స్ మొత్తం మార్చాలని ఆదేశించారు. పనులపై టీఎస్ఎంఐడీసీ ఇంజనీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆమె జిల్లా జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగుల కోసం నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ పనులపై విస్మయాన్ని వ్యక్తం చేశారు. పదిరోజుల్లో పనులు పూర్తి చేయాలని డీఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఆతర్వాత ఆస్పత్రిలో డ్రగ్‌స్టోర్‌ను పరిశీలించారు. అవసరం ఉన్న మందులు, సరఫరా కాని మందుల వివరాలు అందించాలని సూచించారు. ఆతర్వాత సదరం కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆమె వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్ కిరణ్‌కుమార్, బి.కిరణ్‌కుమార్, ఆర్ఎంవోలు బి రాంబాబు, డాక్టర్ వినాయక్‌రాథోడ్ న్నారు.

కోడిగుడ్ల సరఫరా టెండర్ ఫైనల్ చేయండి

జిల్లాలోని సంక్షేమ హాస్టళ్ల (రెసిడెన్షియల్ పాఠశాలలు), అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన కోడిగుడ్ల సరఫరా టెండర్‌ను ఆగస్టు మొదటివారం నాటికి ఫైనల్ చేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి గురువారం జిల్లాలోని శిథిలావస్థలో ఉన్న భవనాల మార్పు, కామన్ డైట్‌మెనూ అమలు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఆగస్టు మొదటివారం వరకు జిల్లాలో మధ్యాహ్నం భోజనం మినహాయించి మిగిలిన రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన గుడ్లను స్థానికంగా సరఫరా చేసేందుకు టెండర్లను ఫైనల్ చేయాలన్నారు. టెండర్ ప్రక్రియ నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. జిల్లాలో శిథిలావస్థ భవనాలలో ఉన్న హాస్టల్స్, అంగన్వాడీ కేంద్రాలను తక్షణమే షిఫ్ట్ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రతి బుధవారం జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేస్తూ నివేదిక అందించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ అభివృద్ధి అధికారి కస్తాల సత్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎన్. విజయలక్ష్మీ, మైనారిటీ సంక్షేమ అధికారి పురందర్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్



ఖమ్మంకలెక్టరేట్,జూలై10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా శంకర్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రాజేశ్వరరావు నూతన ప్రిన్సిపాల్ శంకర్‌కు స్వాగతం పలికారు. ఆ తర్వాత చాంబర్‌లోకి తీసుకెళ్లి ఆయనకు బాధ్యతలను అప్పగించారు. మెడికల్ కాలేజీ, జీజీహెచ్ ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ఏడీ రఘు కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎల్ కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి కిరణ్‌కుమార్, ఆర్ఎంవోలు రాంబాబు, వినాయక్ రాథోడ్, ఏడీ సంతోష్ కుమార్, ఆఫీస్ సూపరింటెండెంట్ రవి కిషోర్, ఉదయ్ ప్రిన్సిపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

నేడు సేంద్రియ రైతు బజార్‌ను ప్రారంభించనున్న మంత్రి తుమ్మల

ఖమ్మంమార్కెట్, జూలై10(ఆంధ్రజ్యోతి): నగరంలోని వీడియోస్ కాలనీలో గల ఇంటగ్రేటెడ్ మార్కెట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సేంద్రియ రైతుబజార్‌ను శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు. జిల్లాలో సేంద్రీయంగా సాగు చేసి పండించిన కూరగాయలు, ఇతర ఆహార ఉత్పత్తులను మాత్రమే ఆరోగ్యాభిలాషుల కోసం అందుబాటులోకి తేవడానికి రాష్ట్రంలోనే మొదటగా ఖమ్మం నగరంలోనే ఈ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న తెలంగాణ అగ్రి-హార్టికల్చర్ ముఖ్య సలహాదారు నల్లమల వెంకటేశ్వరరావు తెలిపారు.

సవరణ

'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ఈ నెల 10న 'ఆరు నెలలకు రెట్టింపు డబ్బుల పేరిట మోసం' శీర్షికన ప్రచురితమైన వార్తలో తప్పు దొర్లింది. జనాల వద్ద డబ్బులు వసూలు చేసి మోసం చేసిన కేసులో కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన రాజేంద్రమూర్తిని అరెస్టు చేశారు. రాజేంద్రమూర్తి పేరుకు బదులు పొరపాటుగా రాంచంద్రమూర్తి అని ప్రచురితమైంది. పేరు తప్పుగా వచ్చినందుకు చింతిస్తున్నాం. ఈ కేసుతో రాంచంద్రమూర్తికి ఎలాంటి సంబంధం లేదు. గమనించగలరు.

\- ఎడిటర్

42శాతం రిజర్వేషన్ చట్టబద్ధత తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడీల కుమార్‌గౌడ్

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై10(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ చట్టబద్ధత కలిపించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనిఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడీల కుమార్‌గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, సర్పంచ్‌లు సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య పేర్కొన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బీసీపీఎఫ్, బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు 42శాతం బీసీలకు రిజర్వేషన్ చట్టబద్ధత కలిపిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. బీసీసామాజికవర్గానికి మొత్తం జనాభా సర్వే నిర్వహించాలని, 33శాతంరిజర్వేషన్లతో బీసీ మహిళలకు అవకాశం ఇవ్వాలన్నారు. 42 శాతం బీసీలకు అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసమావేశంలో రాష్ట్రసర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్,ప్రకాష్, వల్లూరి వీరేష్, సాగర్,రాజేష్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సిటీస్పెషల్ బ్రాంచ్ ఏసీపీ



ఖమ్మంఖానాపురంహవేలి,జూలై10(ఆంధ్రజ్యోతి):ఖమ్మంసిటీ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా టి.మహేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునిల్ దత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

సంపూర్ణ అక్షరాస్యతకు అడుగులు

» **గ్రామదీపికలు, ఆర్పీల ఆధ్వర్యంలో సర్వేలు**



సమీక్ష జరుపుతున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లా సంపూర్ణ అక్షరాస్యతగా అడుగులు వేస్తోంది. జిల్లావ్యాప్తంగా మరోసారి వయోజన విద్య రూపంలో నిరక్షరాస్యులను గుర్తించి వారికి గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామదీపికలు, అంగన్వాడీలు, పట్టణ ప్రాంతాల్లో ఆర్పీలు ఇతర ఉద్యోగులతో విద్యాభ్యాసం చేయించేందుకు కార్యాచరణ జరుగుతుంది. ఉల్లాస్ యాప్‌లో నిరక్షరాస్యుల సర్వే, గుర్తింపు, మరణించిన వారి వివరాలు తొలగింపు నుంచి అక్షరాస్యతకు తీసుకుంటున్న చర్యల వరకు జిల్లా రాష్ట్ర స్థాయిలోనే ప్రథమ స్థానం దక్కించుకుంది.

గ్రామాల్లో 50,564, మునిసిపాలిటీల్లో 16,950 మంది నిరక్షరాస్యులు

ఖమ్మం జిల్లాలోని గ్రామాల్లో ఇప్పటికే గ్రామ దీపికలు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. 50,564 మంది నిరక్షరాస్యులను గుర్తించారు. ఖమ్మం, వైరా, సత్తుపల్లి, మధిర మున్సిపాలిటీల్లో మరో 16,950 మందిని గుర్తించారు. కాగా మహిళా స్వయం సహాయక సంఘాల్లోను ఇంకా వేలి ముద్రలు వేసే వారిని నిరక్షరాస్యులను గుర్తించాలని కలెక్టర్ అనుదీప్ వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కు సూచించారు. దీంతో ఏసీఎల్‌పీ శ్రీజ ఆధ్వర్యంలో ఏపీఎంలతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గ్రామాలు, నగరాల్లో మరోసారి సర్వే నిర్వహించి నిరక్షరాస్యులను గుర్తించాలని ఆదేశించారు. నగరంలోను మేయర్ పునుకొల్లు నీరజ కార్పొరేటర్లు, మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాత, సీవో సయ్యద్ సల్మా, చిలకా ద్రౌపది, గొప్పోజు ఉపేంద్ర, బొల్లికొండ రోజాతో సమావేశం నిర్వహించారు. పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న 57వ డివిజన్‌లో జరుగుతున్న సర్వే, మరణించిన వారి గుర్తింపు వివరాలను తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో నిరక్షరాస్యులకు అక్షరాస్యతకు తీసుకోవాల్సిన చర్యలపై వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌తో సమీక్షించారు. ఉల్లాస్ యాప్‌లో ఇప్పటి వరకు గుర్తించిన నిరక్షరాస్యుల వివరాలను నమోదు చేశారు. త్వరలోనే నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పేందుకు ప్రత్యేకంగా అచ్చు పుస్తకాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా ఓపెన్ స్కూల్ అవగాహన గోడపత్రాలను మేయర్ పునుకొల్లు నీరజ ఆవిష్కరించారు.

బ్యాగుల పంపిణీ

ఖమ్మంకార్పొరేషన్,జూలై10(ఆంధ్రజ్యోతి): రామన్నపేట చర్చిలో గురువారం హోప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ సామగ్రి పంపిణీ చేశారు. 70మంది విద్యార్థులకు బ్యాగులు, టెస్టుపుస్తకాలు, పెన్నులు, నోట్ పుస్తకాలు, ప్యాడ్లు, ఇతర సౌకర్యాలను పంపిణీ చేశారు. పీట్ల కృష్ణమూర్తి, బోజేడ్ల సూర్యారావు, ఏ లాల్, అనసూయ, హిమబందు పాల్గొన్నారు.

స్టేడియంలో ట్రాక్ పరిశీలన

ఖమ్మంస్పోర్ట్స్, జూలై 10(ఆంధ్రజ్యోతి): సర్ధార్‌పటేల్ స్టేడియంలో నిర్మాణంలో ఉన్న సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణ పనులను గురువారం రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి పరిశీలించారు. ట్రాక్‌నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డీవైఎస్‌వో సునిల్ రెడ్డిని కోరారు. ఆయన వెంట జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎండీ షఫీక్‌అహ్మద్, గౌరవాధ్యక్షుడు నున్నా రాధాక్రిష్ణ కోచ్ గౌస్ తదితరులు ఉన్నారు.

గడువులోపు సీఎంఆర్ పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంకలెక్టరేట్, జూలై10(ఆంధ్రజ్యోతి): గడువులోగా సీఎంఆర్ రైస్ పంపిణీని రైస్ మిల్లర్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన సీఎంఆర్ రైస్ డెలివరీపై రైస్ మిల్లర్లతో గురువారం సమీక్షించారు. 2024-25 ఏడాది జిల్లాలో రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి పెండింగ్ 36అండర్ టేకింగ్స్ రైస్ మిల్లుల నుంచి మూడురోజుల్లోరావాలన్నారు. అండర్ టేకింగ్స్ రాని రైస్ మిల్లులకు సీఎంఆర్ ఆపాలని అదనపు కలెక్టర్ సూచించారు.అనంతరం అదనపు కలెక్టర్ మిల్లుల వారీగా పెండింగ్ రైస్ డెలివరీ సంబంధించి సమీక్ష నిర్వహించి రైస్ డెలివరీ పూర్తి చేయాలని ఆదేశించారు.

జాతీయ మత్స్య రైతుల దినోత్సవం

జాతీయ మత్స్య రైతుల దినోత్సవం సందర్భంగా, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి శివ ప్రసాద్‌పాల్గొన్నారు.

ఏదులాపురం మునిసిపాలిటీలో ఇంటిపన్నుల పెంపు

ఖమ్మంరూరల్,జూలై10(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీలో నూతన పన్నుల విధానాన్ని రూపొందించినట్లు మునిసిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో గ్రామ పంచాయతీలుగా ఉన్న సమయంలో ఇంటి మూలధనంపై నివాస గృహాలకు 0.12శాతం ఇంటిపన్ను ఉండేది. దానిని అలాగే ఉంచారు. వ్యాపార సముదాయం ఇళ్లకు 0.16శాతం పన్నువసూళ్లు ఉండేవని తెలిపారు. తాజాగా వ్యాపార సముదాయ ఇళ్లకు మాత్రం 0.25శాతం పన్ను పెంచారు. ఖాళీప్లాట్లకు 0.05శాతం పన్ను వసూలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడు పెద్దిరాజు కన్నుమూత

నేలకొండపల్లి, జూలై10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగ్రాజుపల్లి గ్రామానికి చెందిన సీనియర్ సభ్యుడు పెద్దిరాజు వీరయ్య(93)గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. సీపీఎం నాయకులు వీరయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతదేహంపై పార్టీ జెండాను కప్పారు. మృతునికి భార్య, నలుగురు కుమారులు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. జీవితాంతం పార్టీ పట్ల విశ్వాసం, అంకితభావంతో పని చేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన గొప్ప కమ్యూనిస్టు పెద్దిరాజు వీరయ్య అనిపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండి రమేష్ అన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టిపెట్టండి

తిరుమలాయపాలెం, జూలై10(ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించే పామాయిల్ సాగుపై రైతులు దృష్టిసారించాలని జిల్లావ్యవసాయాధికారి డి.పుల్లయ్య తెలిపారు.గురువారం మండలంలోని మేడిదపల్లి, ఏలువారిగూడెంలో ఆయిల్‌పామ్‌సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం తిరుమలాయపాలెంలో పలు ప్రభుత్వ వసతిగృహాలను తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో ఏవో సీతారాంరెడ్డి, వసతిగృహ అధికారి పూలన్‌దేవి, ఉద్యాన అధికారి అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవారు



కూరగాయలతో అలంకరించిన అమ్మవారు

తల్లాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలోని ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారు గురువారం శాకంబరీగా దర్శనమిచ్చారు. ఆషాడమాసం పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని కూరగాయలతో శాకంబరిగా అలంకరించి ఆలయ అర్చకుడు కంచల సతీష్ శర్మ ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఉద్యాన పంటల సాగు లాభదాయకం

పెనుబల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కూరగాయలు, పండ్లు, పామాయిల్ తోటల సాగు ఎంతో లాభదాయకమని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమల అధికారి ఎంవీ.మధుసూదన్‌రావు అన్నారు. గురువారం పెనుబల్లి మండలం గంగదేవిపాడులో సాగుచేస్తున్న పండ్లు, కూరగాయల తోటలను, ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. సాంప్రదాయ పద్ధతులు కాకుండా వైవిద్య పంటల సాగు లాభదాయకమని ఆయన అన్నారు. కూరగాయలు, పండ్లు సాగుచేస్తున్న రైతులను ఆయన అభినందించారు. కూరగాయల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను, ప్రభుత్వం అందించే రాయితీలను వివరించారు. రైతులు సంఘటితంగా ఉండి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీని ఏర్పాటుచేసుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహకాలు అందుతాయని తెలిపారు. పామాయిల్ పంట సాగుచేపట్టాలని, మొక్కల పెంపకానికి డ్రిప్ పరికరాలు రాయితీపై సరఫరా చేస్తుందని తెలిపారు.



తోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి మధుసూదన్‌రావు

'ఓపెన్' అడ్మిషన్లను వినియోగించుకోవాలి

ఏన్కూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక విద్యాపీఠం 2025-26 ద్వారా నిర్వహించే పది, ఇంటర్ ఓపెన్‌స్కూల్ అడ్మిషన్లను వినియోగించుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్ధాంతరంగా చదువు మానేసిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అపరాధారుసుంతో ఆగస్టు 12చివరితేది అన్నారు. వివరాలకు 9573354994, 9490407478 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పరిశీలన

మధిర రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం నాగవరప్పాడు గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత గురువారం పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఇళ్లు నిర్మించుకునే స్థలాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఎంపీవో శాస్త్రీ, కార్యదర్శి ఉపేందర్ పాల్గొన్నారు.

వంశీచంద్‌రెడ్డిని కలిసిన కట్ల



వంశీచంద్‌రెడ్డితో కట్ల సోదరులు

వైరా, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ కార్యదర్శి ఉమ్మడి ఖమ్మంజిల్లా ఇన్‌చార్జ్ అయిన చల్లా వంశీచంద్‌రెడ్డిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు గురువారం ఖమ్మంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి అభినందించారు. కట్ల సంతోష్, నాగరాజు, రేచర్ల నాగేశ్వరరావు, బండ్ల కృష్ణ పాల్గొన్నారు.


వైరా ఆయకట్టులో నీటి విడుదల



కాల్వలో ప్రవహిస్తున్న నీరు

వైరా, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్ సీజన్‌లో వైరా రిజర్వాయర్ ఆయకట్టులో వరినారుమళ్లకు గురువారం నీరు విడుదల చేశారు. కుడి, ఎడమకాల్వల హెడ్‌స్లూయిస్‌కు చెందిన లాకులను స్వల్పంగా ఎత్తి నీటి సరఫరాకు శ్రీకారం చుట్టారు. నీటిపారుదలశాఖ అధికారులు ఎలాంటి అధికారిక ప్రకటన చేయకుండానే రైతుల నుంచి వచ్చిన వత్తిళ్ల మేరకు నారుమళ్లు పోసుకోవడానికిగానూ నీరు విడుదల చేశారు. నారుమళ్లు కొంతమేరకు పెరిగిన తర్వాత అధికారికంగా నాట్ల కోసం నీరు విడుదల చేసేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. రైతులు ఈ నీటిని వృథా చేయకుండా నారుమళ్ల కోసం పొదుపుగా వాడుకోవాలని నీటిపారుదలశాఖ అధికారులు, సిబ్బంది సూచిస్తున్నారు.


ఆధ్యాత్మిక యాత్రికుడికి ఘన సన్మానం



ప్రవీణ్‌కుమార్ శాస్త్రిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సత్తుపల్లిరూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): భారతదేశం పవిత్రమైన పురాతన దేవాలయాలకు నిలయమని మున్సిపల్ మాజీ ఛైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని బుల్లెట్‌పై 30రోజులలో చుట్టివచ్చిన ఆధ్యాత్మిక యాత్రికుడు, పురోహితుడు ఉప్పల ప్రవీణ్‌కుమార్ శాస్త్రిని బీఆర్ఎస్ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఆధ్యాత్మిక యాత్ర అనేది కేవలం దేవాలయాలను సందర్శించడం మాత్రమే కాకుండా మనస్సు, శరీరాన్ని శాంతి, పవిత్రతతో నింపుకోవడానికి ఒక గొప్ప అవకాశమన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఎస్‌కే.చాంద్‌పాషా, అద్దంకి అనిల్, నాయకులు నరుకుళ్ల శ్రీను, అమరవరపు కృష్ణారావు, పర్వతనేని వేణు, మట్టా శివ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆశాకార్యకర్త మృతి



తల్లాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం బస్వాపురం గ్రామానికి చెందిన ఆశావర్కర్ మోదుగ సులోచన(49) గురువారం అనారోగ్యంతో మృతిచెందంది. మూడేళ్ల క్రితం భర్త బలరాం కూడా అనారోగ్యంతో మృతిచెందాడు. ఆమె కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స చేస్తుండగా అక్కడే మృతి చెందింది. సులోచనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు. సులోచన మృతదేహాన్ని జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ శేషుపద్మ, మండల వైద్యాధికారి డాక్టర్ ఐ.రత్నమనోహర్, హెల్త్‌సూపర్‌వైజర్ కె.పెద్దపుల్లయ్య సందర్శించి నివాళులర్పించారు. తల్లాడ సిబ్బంది రూ21వేల ఆర్థికసాయాన్ని అందించారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయాలతో పాటు ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మూడు నియోజక వర్గాల్లోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానాలు చేశారు. పలు గ్రామాల్లో యువకులు విద్య నేర్పిన గురువులకు శాలువలతో ఘనంగా సన్మానించారు. గురువారం తెల్లవారుజామునుంచే ఆలయాలలో ప్రత్యేక పూజలు, హోమాలు, కాగడ ఆరతి, పంచామృతి అభిషేకం, స్వామివారికి సహస్ర నామార్చన, మధ్యాహ్నాఆరతి, సాయం సంధ్యా ఆరతి, సాయిచాలీసా పారాయణం, శేజారతి తదితర పూజలు నిర్వహించారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలను ఆలయాల సిబ్బంది ఏర్పాటు చేశారు.



మధిరలో పూజల్లో పాల్గొన్న మహిళలు



వైరాలో పూజలు చేస్తున్న భక్తులు



కల్లూరులో గురువులను సన్మానించిన ద్రశ్యం



ఆలయంలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం



ఉపాధ్యాయురాలుని సన్మానిస్తున్న బీజేపీ నాయులు

సీపీఐ మండల కార్యదర్శిగా యామాల



వైరా, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సీపీఐ వైరా మండల కార్యదర్శిగా నాలుగోసారి యామాల గోపాలరావు, సహాయ కార్యదర్శిగా మోట కొండా ఎన్నికయ్యారు. మండలంలోని గొల్లపూడి గ్రామానికి చెందిన గోపాలరావు ఇప్పటివరకు మూడు దఫాలుగా మండల కార్యదర్శిగా పనిచేశారు. మండలంలో సీపీఐ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు.

పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారిగా శశికిరణ్

తల్లాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారిగా తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన గాజుల శశికిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఖమ్మంలో జరిగిన పీడీఎస్‌యూ జిల్లాస్థాయి నిర్మాణ విస్తృత సమావేశంలో శశికిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ ప్రకటించారు. జిల్లాలో విద్యార్థి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని శశికిరణ్ తెలిపారు.

ఆలయ చైర్మన్‌గా ఉషారాణి

వైరా, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామంలో కొలువైన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా మాజీ సర్పంచ్ దొడ్డా ఉషారాణి నియమితులయ్యారు. ఆలయ ధర్మకర్తల మండలి నియామక ఉత్తర్వులను రాష్ట్ర దేవాదాయశాఖ డైరెక్టర్ జారీ చేశారు. చైర్మన్‌గా దొడ్డా ఉషారాణి, ధర్మకర్తల మండలి సభ్యులుగా మల్లు శేషమ్మ, సుల్తాన్ పద్మ, మొగునూరి సత్యనారాయణ, తలారి నర్సింహారావు, గిరిగాని శ్రీనివాసరావు, సంగెపు రామకృష్ణ నియమితులయ్యారు.

నానో ఎరువులపై అవగాహన

ఏన్కూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నానో ఎరువులపై వ్యవసాయశాఖ, ఇఫ్కో కంపెనీ సంయుక్తంగా గురువారం స్థానిక రైతువేదికలో రైతులకు అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారి నరసింహారావు నానో ఎరువులు ప్రాముఖ్యతను వివరించారు. నానో ఎరువుల వినియోగం ద్వారా వ్యవసాయ ఉత్పాదకత మెరుగుపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో సేల్స్ ఆఫీసర్ నాగార్జున, డెవలప్‌మెంట్ ఆఫీసర్ వై.మహేందర్‌రెడ్డి, ఏఈవోలు బాలకృష్ణ, శ్రీకాంత్, లహరి, నవ్య, భవ్య తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎరువుల వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని మధిర ఏడీఏ విజయ్‌చంద్ర సూచించారు. గురువారం స్థానిక పత్తి పంటలను ఆయన పరిశీలించారు. పంటలకు ఎరువులు వాడే విషయంలో ఏమోతాదులో వాడాలనే విషయాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. రైతులకు నానోయూరియా గురించి అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి సరిత, ఏఈవో మౌనిక, రైతులు పురుషోత్తం, వెంకట్, బుర్రా శ్రీను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో

నామినేటెడ్ పదవుల కోసం ఆశావహుల ఎదురుచూపు..

- సీఎం ఆదేశాల మేరకు ఈనెల ఆఖరులోపు పదవులు భర్తీ అయ్యేనా?

వైరా, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల కోసం ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా నియోజకవర్గంలో ఇంతవరకు ఏ ఒక్క నామినేటెడ్ పోస్టును భర్తీ చేయలేదు. ఎట్టకేలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలిని మాత్రం నియమించారు. ఇకపోతే నియోజకవర్గంలోని రెండు వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలక మండళ్లను, ఆత్మ కమిటీని అలాగే ఐదుమండలాల్లోని ఇంచుమించుగా పెద్ద సంఖ్యలో ఆలయ కమిటీల ధర్మకర్తల మండళ్లను నియమించాల్సి ఉంది. నామినేటెడ్ పదవుల నియామకాల్లో జరుగుతున్న జాప్యం, అలసత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల పలు సందర్భాల్లో తన అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేశారు. నామినేటెడ్ పదవులకు అర్హులైన వారిని సిఫార్సు చేసే విషయంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు ఆసక్తి చూపటం లేదని కూడా వ్యాఖ్యానించారు. ఈనెల చివర్లోగా నామినేటెడ్ పదవుల భర్తీ పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు. ఈ నేపథ్యంలో వైరా నియోజకవర్గంలోని నామినేటెడ్ పదవుల ఆశావాహుల్లో కొత్త ఆశలు చిగురించాయి. నియోజకవర్గంలో వైరా, ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. వైరా మార్కెట్ కమిటీ బీసీకి రిజర్వు అయింది. చైర్మన్ పదవికి బొర్ల గంగారావు, ఏదునూరి సీతరాములు, గుత్తా కళావతి మధ్య తీవ్రమైన పోటీ ఉంది. ఈ ముగ్గురు కూడా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌కు సన్నిహితులుగా ఉన్నారు. ఈముగ్గురిలో చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందోనని ఆశావాహులు ఉత్కంఠతతో ఉన్నారు. ఇకపోతే ఏన్కూరు మార్కెట్ కమిటీ ఎస్టీకి రిజర్వు అయింది. అక్కడ కూడా చైర్మన్ పదవి కోసం పలువురు నాయకులు పోటీపడుతున్నారు. ఇక్కడ చైర్మన్ ఎంపిక ఎమ్మెల్యేకు సవాల్‌గా ఉంది. ఇకపోతే నియోజకవర్గ స్థాయిలో ఆత్మకమిటీ చైర్మన్ నియామకం చేయాల్సి ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆత్మకమిటీ చైర్మన్‌గా నియమితులైన కోసూరి శ్రీనివాసరావు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఇప్పటివరకు ఆయనే పదవిలో కొనసాగారు. ఇకపోతే రాష్ట్ర దేవాదాయశాఖ పరిధిలోని 8ఆలయాలకు ధర్మకర్తల మండళ్లను నియమించాల్సి ఉంది. ఆ స్థాయిలోని ఒక్క స్నానాల లక్ష్మీపురం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి మాత్రమే ధర్మకర్తల మండలిని నియమించారు. మిగిలిన ధర్మకర్తల మండళ్లకు సంబంధించి రాష్ట్ర దేవాదాయశాఖకు వైరా నుంచి ప్రతిపాదనలు కూడా వెళ్లలేదు. ఐదు గురు ధర్మకర్తల మండలి సభ్యులతో కమిటీలు వేయాల్సిన ఆలయాలు పెద్దసంఖ్యలో ఉన్నాయి. ఇవి వరంగల్ దేవాదాయశాఖ అధికారి పరిధిలో ఉన్నాయి. ఈ ఆలయాల ధర్మకర్తల మండళ్లకు కూడా ప్రతిపాదనలు పంపించాల్సి ఉంది. ఈ పదవులు ఆశిస్తున్న వారు కూడా వాటి కోసం ఎదురుచూస్తున్నారు.

నగర దీపికలకు ఘన సన్మానం



కల్లూరులో నగర దీపికలను సన్మానించిన దృశ్యం

కల్లూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మునిసిపాలిటీ పరిధిలో గల పలు గ్రామల గ్రామదీపికలను గురువారం ఏఐటీయూసి ఆధ్వర్యంలో శాలులతో సత్కరించారు. ఈ సందర్భంగా గత 22 సంత్సరాలుగా ఏడు గ్రామ పంచాయితీలకు చెందిన ఐకెపి వివోలు మున్సిపాలిటీలోకి వీలినం అయినారు. గతంలో మండలంలో చేసిన సేవలకు నిదర్శనంగా గుర్తించి ఏఐటీయూసి తరుపున జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, మండల సీపీఐ కార్యదర్శి దమాల దయాకర్, గ్రామ దీపికల సంఘం జిల్లా నాయకురాలు వేము నాగమణిలు వారిని ఘనంగా సత్కరించారు. విద్య, వైద్య, ఆరోగ్య, వ్యక్తి గత పరిశుభ్రత విషయాలలో మహిళలను చైతన్య వంతులుగా చేశారని రాంబాబు చెప్పారు. నగర దీపికలుగా గుర్తించ బడిన దీపికలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి మహిళలు ఆర్థికంగా బలపడేలా కృషి చేయాలని కోరారు.

వంశీచంద్‌రెడ్డిని కలిసిన వైరా ఎమ్మెల్యే

వైరా, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ కార్యదర్శి సీడబ్ల్యూసీ శాశ్వత సభ్యుడు, ఉమ్మడి ఖమ్మంజిల్లా ఇన్‌చార్జ్ చల్లా వంశీచంద్‌రెడ్డి గురువారం జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా నియోజకవర్గంలోని ఐదుమండలాల కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, వైరా, కొణిజర్ల, సింగరేణి, ఏన్కూరు, జూలూరుపాడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, తలారి చంద్రప్రకాష్, స్వర్ణ నరేందర్, మంగీలాల్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనుమోలు కృష్ణప్రసాద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, పగడాల మంజుల తదితరులు పాల్గొన్నారు.



వంశీచంద్‌రెడ్డికి బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే

వంటగ్యాస్‌ను సురక్షితంగా వినియోగించాలి

- కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయనంద్

సత్తుపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వంటగ్యాస్‌ను ప్రతిబక్కరూ వినియోగించుకుని ఆరోగ్యకరంగా జీవించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. సత్తుపల్లి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరా ఇండేన్ గ్యాస్ ఏజన్సీ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ఎల్‌పీజీ వంటగ్యాస్ వినియోగం, వినియోదారుల భద్రత, ప్రమాదాలపై విద్యార్థినీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీలు ఆర్.సుప్రియ, జి.కావ్య, ఓంశ్రీలకు బహుమతులను అందజేశారు. వంటగ్యాస్ సిలీండర్లు ప్రమాదాలకు గురయ్యో సమయంలో చాకచక్యంగా వ్యవహరించి వినియోగదారులు వెంటనే 1902నంబర్‌కు ఫోన్‌చేసి ప్రమాదాన్ని నివారించుకోవచ్చునన్నారు. గ్యాస్ సిలీండర్‌ను ఎల్లప్పుడు నిటారుగా ఉంచాలని, గ్యాస్ స్టవ్ సిలిండర్ కన్నా ఎత్తులో చదునైన ప్రదేశంలో ఉంచాలని, ఎల్లప్పుడు నిలబడే వంట చేయాలన్నారు. బాగా గాలి తగిలే ప్రదేశంలో గ్యాస్ స్టవ్ ఉంచరాదని, వంటగదిలో రిఫ్రిజిరేటర్ కానీ, వెలుగుతున్న దీపంకానీ ఉంచరాదన్నారు. ఎల్లప్పుడు అగ్గిపుల్ల వెలిగించిన తరువాత గ్యాస్ స్టవ్ ఆన్ చేయాలని, వంట చేసేటప్పుడు ఎప్రాన్/కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలని, అలాగే వంట పాత్రలు దించేందుకు దుస్తులు కాకుండా పాట్ హోల్డర్లు వాడాలన్నారు. రెగ్యులేటర్‌ను ప్రతిరాత్రి నిద్రపోయేందుకు, బయటకు వెళ్లేముందు ఆఫ్ చేయాలన్నారు. ఐఎస్ఐ మార్క్ కలిగిన రబ్బర్ ట్యూబులను ప్రతి ఐదేళ్లకోసారి తప్పకుండా మార్చాలని, రబ్బర్ ట్యూబ్ అమర్చినప్పుడు నూనెగానీ, సబ్బులాంటివి కాకుండా కేవలం నీళ్లు మాత్రమే వాడాలని సూచించారు. ఒకవేళ గ్యాస్ వాసన వచ్చినప్పుడు రెగ్యులేటర్ ఆఫ్‌చేసి, విద్యుత్ స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయకుండా గాలి కోసం తలుపులు, కిటికీలు తెరచి డిస్ట్రిబ్యూటర్ని గానీ, ఎమర్జన్సీ సర్వీస్ సెల్ వారికి వెంటనే తెలియజేయాలని కోరారు. అదేవిధంగా గ్యాస్ బుకింగ్ కోసం 8454955555 కాల్ చేయాలని, అన్నివేళలా అందుబాటులో ఉండే టోల్‌ఫ్రీ నంబర్ 18002333555కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.చలసాని హరికృష్ణ, నిర్వాహకులు వందనపు సత్యనారాయణ, కోటగిరి సుధాకర్‌బాబు, గుండు ఉమామహేశ్వరరావు, సాయి, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.



పరిక్షలో విజేతలైన విద్యార్థునులతో డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక చేయూత

- ఔదార్యం చాటుకున్న మాజీ జడ్పీటీసీ లక్కినేని రఘు

కల్లూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు గురువారం మాజీ జడ్పీటీసీ డాక్టర్ లక్కినేని రఘు తనవంతు సాయంగా బియ్యం, నగదును అందించారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యంతోపాటుగా రూ. 3వేల నగదును అందజేశారు. లబ్ధిపొందిన వారిలో ఉబ్బన బాబురావు, తోట ధర్మ, కొండలరావు, సులోచన, ఎడవల్లి రాము ఉన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమ సమాచారం తెలుసుకుని నేరుగా ఇంటి వద్దకు వచ్చి ఆర్థిక చేయూత నిచ్చిన లక్కినేని రఘుకు బాధిత కుటుంబాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయుడు ధర్నాసి బాలరాజు, బాణోతు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి బియ్యం, నగదును అందిస్తున్న లక్కినేని రఘు

ఓటరు నమోదుకు బీఎల్‌వోలకు శిక్షణ

ఎర్రుపాలెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదికలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో ఓటరు నమోదుకు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఉషాశారద మాట్లాడుతూ.. బూత్‌లెవల్ ఆఫీసర్లకు గ్రామాల్లో ఎవరు ఓటరుగా నమోదు అవుతారు అనే విషయాలపై అవగాహన ఉండాలని సూచించారు. బూత్‌లెవల్‌లో విధులు నిర్వహించే బీఎల్‌వోలకు ఓటరు నమోదుపై కొన్ని ప్రధాన చట్టపరమైన నిబంధనలను ఈ శిక్షణ ద్వారా తెలుసుకోవాలన్నారు. విధుల్లో భాగంగా ఓటరు నమోదుకు అవసరమైన పూర్తిస్థాయి శిక్షణను క్షేత్రస్థాయిలో అవలంభించాల్సిన కార్యాచరణను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రవికుమార్, రాజశేఖర్, శిక్షణ అధికారులు ఎండీ రఫీ, ఎండీ జమీర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ ఉషాశారద

రూ.700కోట్ల పెండింగ్ బిల్లులు విడుదల

- ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి కృషి అద్వితీయం
- పీఆర్టీయూ కార్యదర్శి రంగారావు

బోనకల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి కృషితో ఉపాధ్యాయులకు సంబంధించి రూ. 700 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదలయ్యాయని పీఆర్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు తెలిపారు. మండలంలోని ముష్టికుంట్ల, చిరునోముల, జానకీపురం, బోనకల్ తదితర ఉన్నత పాఠశాలల్లో గురువారం ఆ సంఘ క్యాంపెయినింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచినా ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించక పోవడం శోచనీయమన్నారు. సీపీఎస్ రద్దు, హెల్త్ కార్డుల మంజూరు, పీఆర్‌సీ, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. పీఆర్టీయు జిల్లా, మండల నాయకులు గుత్తా శ్రీనివాసరావు, ఆర్. బ్రహ్మారెడ్డి, రత్నకుమార్, కొమ్ము శ్రీనివాసరావు, కొనకంచి రామ్మోహన్, మద్దినేని వెంకటేశ్వరరావు, అరికె నర్సింహారావు, కొండలరావు, ఝాన్సీ కిరణ్మయి, శారద పాల్గొన్నారు.